Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 29.09.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com





> కీలకంగా మారిన సోదరులు
> రాజకీయాలపై తీవ్ర ప్రభావం


## 'మెగా' చూపు...

# ఎవరి వైపు

**2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రతిపక్ష పాత్ర దక్కిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి మధ్య ఓట్ల తేడా 5లక్షలు. ఈ కొన్ని ఓట్ల తేడాతోనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే, వెంట్రుకవాసిలో జగన్ సీఎం అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. ఈ 5లక్షల ఓట్లు తేడా ఎక్కడ వచ్చి వుండొచ్చు... జగన్ ఇవ్వని, చంద్రబాబు ఇచ్చిన ఋణమాఫీ వల్ల అయ్యుండొచ్చు, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపినందువల్ల పడి వుండొచ్చు, బీజేపీతో పొత్తు కలిసివచ్చి వుండొచ్చు. కాలం కలిసొస్తే అవకాశాలు, అధికారం వాటంతట అవే నడుచుకుంటూ వస్తాయి. రాజకీయాలలో ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదు అన్నదానికి ఇవి ఉదాహరణలు.**

తెలుగుదేశం ఒక ప్రాంతీయపార్టీ. స్వర్గీయ ఎన్టీఆర్ వేసిన పునాదులే దాని బలం. కాబట్టి అక్కడ ప్రజాకర్షణ వున్న నాయకుల అవసరం లేదు. వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ఆరేళ్ళ పసికూన. కేవలం దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి పట్ల వున్న ప్రజాభిమానం, యువనేతగా జగన్ పడుతున్న కష్టమే ఈ పార్టీ ప్రధానబలం. అయినా కూడా మూడున్నర దశాబ్దాల చరిత్రగల తెలుగుదేశంను బలంగా ఢీ కొంటున్నాడంటే జగన్ సామాన్యుడు కాదు. అయితే రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే ప్రతి ఓటు కూడా కీలకమే! ఈ దశలో లక్షల ఓట్లను ప్రభావితం చేయగల వ్యక్తులు ఇంకెంతో కీలకం అవుతారు.

అటు తెలుగుదేశం, ఇటు వైకాపాలతో సంబంధం లేకుండా రాజకీయరంగంతో మాత్రం సంబంధం వున్న వ్యక్తులుగా మెగాస్టార్ చిరంజీవి, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌లు కనిపిస్తారు. 2014 ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ అభిమానుల ఓట్లు తెలుగుదేశంకు కలిసొచ్చాయి. 2019 ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ రూటు ఏంటన్నదానిపై క్లారిటీ లేదు. ఇక, మెగాస్టార్ చిరంజీవి రాజకీయంగా ఇకముందు ఎటువంటి స్టెప్పులు వేస్తాడన్న దానిపైనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతానికి ఆయన కాంగ్రెస్‌పార్టీలో రాజ్యసభ సభ్యుడిగా వున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇక కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదు. ఇప్పుడు ఆ పార్టీలో మిగిలివున్న నాయకులు రేపటి ఎన్నికలకు టీడీపీ లేదా వైసిపిలలోకి జంప్ చేస్తారు. కాబట్టి చిరంజీవి కూడా అక్కడే కొనసాగే అవకాశాలు లేవు. (మిగతా 11వ పేజీలో)




• వైసిపిలోనూ పెనుమార్పులు

# 'పీకే'సే పనికేనా?



**రాజకీయాలలో నెగ్గుకు రావాలంటే ముందు నాయకుడికి సొంత వ్యూహం, సొంత అంచనా వుండాలి. ప్రజల నాడి తెలిసి వుండాలి. ప్రజల ఆలోచనలకు తగ్గట్లుగా హామీలు, మేనిఫెస్టోలు తయారు కావాలి. ప్రజల ఆలోచనలను, ఆశలను పసిగట్టలేకపోయాడు కాబట్టే 2014 ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రాలేకపోయాడు.**

ఆనాటి వైఫల్యాలను పునరావృతం కానీయకూడదనే ఉద్దేశ్యంతో రేపటి ఎన్నికల దిశగా ఆయన జాగ్రత్తగా అడుగులు వేయాలనుకుంటున్నాడు. ఆ క్రమంలో తప్పటడుగులు కూడా పడుతున్నాయి. వీటిలో ఒకటే రాజకీయ సలహాదారుగా పెట్టుకున్న ప్రశాంత్ కిషోర్‌ను (మిగతా 11వ పేజీలో)

## బాబు ట్రాప్‌లో...

# జూనియర్



> చిక్కాడో...
> మరో పెద్దఎన్టీఆరే?

**'దూకుడు' సినిమాలో బ్రహ్మానందం, ఎం.ఎస్.నారాయణలను హీరో మహేష్‌బాబు ఎలా వాడుకుంటాడో చూసాము. అది సినిమా. రాజకీయాల్లోనూ అలాంటి వాడకం వుంటుంది. అవసరాన్ని బట్టి, అనువైన సమయాన్ని బట్టి ఏ మనిషిని ఏ విధంగా వాడుకోవాలో చంద్రబాబుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.**

రాజకీయాలలో అధికారం కోసం అవసరమైతే సొంత అన్నదమ్ములను కూడా దూరంగా పెట్టాలి. ప్రత్యర్థులనుకున్నవాళ్ళను కూడా పక్కన చేర్చుకోవాలి. తన అధికారం కోసం అడ్డంగా వున్నారని చెప్పే చంద్రబాబు సొంత తమ్ముడిని దూరంగా పెట్టాడు. బావమరుదులు, తోడల్లుడును కూడా కాదనుకున్నాడు. 2014 ఎన్నికల్లో నందమూరి కుటుంబసభ్యులను కూడా కాదనుకుని పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌ను పట్టుకున్నాడు. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం తరపున (మిగతా 11వ పేజీలో)



# భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలు



నెల్లూరు, మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో గల అతిపురాతన శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు దసరా నవరాత్రుల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 21వ తేదీన మొదలైన ఉత్సవాలు 30 వరకు జరుగనున్నాయి. రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. బీజేపీ నాయకులు కల్పం శేఖర్ ఆధ్వర్యంలో వారి కుటుంబసభ్యులు కల్పం శ్రీనివాసులు, కల్పం జగదీష్, కల్పం రమేష్, కోటేశ్వరరావు, సుదర్శనమ్మలు ఉభయకర్తలుగా వ్యవహరిస్తూ ప్రతిరోజు అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు.


# ఏం పొడిచారని... ఇంటింటికి తిరుగుతున్నారు

## - ఎమ్మెల్యే కాకాణి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను చూసి రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని, ఇంటింటికి టిడిపి పేరుతో ఏం సాధించారని తిరుగుతున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వైయస్సార్సీపీ కార్యాలయంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ముసుగులో సీఎం చంద్రబాబు వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై తలసరి అప్పులు రూ.70వేలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కింది తప్ప అభివృద్ధిలో మాత్రం శూన్యమని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంభించలేదా అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి పాలనకు చంద్రబాబు పాలనకు ప్రజలు బేరీజు వేసుకుంటూ గమనిస్తున్నారన్నారు. వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలపై ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. చంద్రబాబు మాత్రం రోజుకు ఎన్ని అబద్ధాలు ఆడామా, ఎంత అవినీతి సంపాదన చేశామా అంటూ లెక్కలు వేసుకోవడానికే సరిపోతుందని ఆరోపించారు. చంద్రబాబు చేస్తున్న నేరాలు, ఘోరాలు త్వరలోనే




బయటపడుతాయన్నారు. ఈమధ్య చంద్రబాబు నంద్యాల ఉప ఎన్నికల రాగం ఎత్తుతున్నారని, ఆ ఎన్నికల్లో నోట్ల కట్టలు తెగి పారాయన్న సంగతి అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అండతో టిడిపి నాయకుల అక్రమాలు, అవినీతి విచ్చలవిడిగా సాగిపోతుందన్నారు. టిడిపి నాయకులకు దమ్ముంటే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ఎన్ని నెరవేర్చారో చెప్పాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మేరిగ మురళీధర్, ఎం.వెంకట శేషయ్య, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



సింహపురి సమాచారం

# ఐలయ్య రచనలను బహిష్కరించాలి

## - ప్రముఖ కవి చిన్ని నారాయణరావు

కంచె ఐలయ్య రాసిన 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్ళు' అనే పుస్తకం ఐలయ్య అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనమని, ఐలయ్య భావాలను ఖండిస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు పేర్కొన్నారు. వ్యాపారమన్నది బతుకుతెరువు కోసం సాగే పోరాటమని, అందులో కొంత లాభాపేక్ష సహజమని, అంతమాత్రాన 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్ళు' అనడం కంచె ఐలయ్య అజ్ఞానానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వైశ్యులు సామాజిక కార్యకర్తలని, సమాజ అభ్యున్నతి కోసం పరితపించే వారని అంటూ ఆ క్రమంలోనే పూజ్య బాపూజీ స్వాతంత్ర్య సంగ్రామం నడిపి జాతిపిత అయ్యారని, మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు తన ఆశయసాధనలో అమరజీవి అయ్యారని ఆయన పేర్కొన్నారు. కంచు మోగినట్లు మోగే కంచె ఐలయ్య ఎక్కడా..కనకంలా నిశ్శబ్ద సేవాపరాయణులైన కోమటోళ్ళు ఎక్కడా?..ఆయనకీ, వీళ్లకీ పోలికే లేదని చిన్ని నారాయణరావు పేర్కొన్నారు. ఐలయ్య రచనల్ని అన్ని సామాజిక వర్గాలు బహిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

# ముసవ్వీర్ మరో అద్భుతం





సూక్ష్మకళాకారుడు డా॥ ముసవ్వీర్ దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చదువులతల్లి "సరస్వతీదేవి" అలంకారంను కేవలం 300మిల్లీగ్రాముల బంగారంతో తయారు చేసి నెల్లూరు ప్రజలకి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# అందరూ బాగుండాలి...




శరన్నవరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ అరుంధతిపాళెంలో ఉన్న శ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నగర ఎమ్మెల్యే డా.పి.అనిల్ కుమార్‌యాదవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. సంతానలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని, ప్రజలంతా సుఖసంతోషాలతో హాయిగా ఉండాలని కోరుకుంటూ పూజలు చేశారు. అదేవిధంగా, డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కూడా అమ్మవారి చల్లని దీవెనలుండాలని కోరుకుంటూ అమ్మవారిని పూజించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, నాయకులు చిరంజీవి, శ్రీహరి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, బి.సత్యకృష్ణ, మద్దినేని శ్రీధర్, పి. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ వీక్లీ విజేత కేతన్



నెల్లూరులోని సిఎంఆర్, చందన దసరా ఫిదా సేల్ 2వ వీక్లీ డ్రాలో అల్లూరు చెందిన కె.కేతన్ విజేతగా నిలిచి బహుమతిని అందుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.డి ఇంతియాజ్ చేతుల మీదుగా బుధవారం ఈ వీక్లీ డ్రా తీయగా, కేతన్‌ను అదృష్టం వరించి స్కూటీని బహుమతిగా అందుకున్నాడు. అదే విధంగా, మరో 30 మంది డైలీ డ్రా విజేతలకు గృహోపకరణ వస్తువులు, మైక్రోఓవెన్, గ్రైండర్, హోమ్‌థియేటర్, మిక్సీ, ఇండక్షన్ స్టౌ, రైస్‌కుక్కర్, డిన్నర్ సెట్‌ల వంటివాటిని బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, చందన, సిఎంఆర్ షాపింగ్ మాల్స్ వారు వినియోగదారులకు ఇలాంటి ఆకర్షణీయమైన బహుమతులు అందజేయడమే కాక, వినియోగదారులకు తక్కువ ధరలకే వస్త్రాలు, బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్, చందన అధినేత ఎం.శ్రీనివాసరావు, మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# పొనకా కనకమ్మ విగ్రహావిష్కరణ

అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ 148వ జయంతిని పురస్కరించుకుని ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి పొనకా కనకమ్మ విగ్రహాన్ని మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలియజేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ఆత్మీయ బంధం



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సెప్టెంబర్ 26వ తేదీ మంగళవారం సాయంత్రం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని "లాయర్" కార్యాలయానికి విచ్చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా "లాయర్" కార్యాలయానికి వచ్చిన సందర్భంగా 'లాయర్' సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఆయనను ఆత్మీయంగా సన్మానించారు.

# మాగుంట లే అవుట్‌లో స్మార్ట్ కిడ్జ్

నెల్లూరు నగరంలో జూబ్లిహిల్స్‌గా చెప్పుకునే మాగుంట లే అవుట్‌లో అన్ని రకాల వ్యాపార, వాణిజ్య సంస్థలు వెలుస్తున్నాయి. ఈ క్రమంలోనే చిన్నపిల్లలకు అవసరమైన నాణ్యతగల వస్తువులు, ఆట బొమ్మలను అందించే విధంగా 'స్మార్ట్‌కిడ్జ్' బేబీ కేర్ అండ్ టాయ్స్ షాపు వచ్చింది. మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డులో 'లాయర్' వారపత్రిక కార్యాలయం క్రింద ఏర్పాటు చేసిన ఈ షాపును ఈ నెల 30వ తేదీ ఉదయం 11గంటలకు విజయదశమి పర్వదినాన ప్రారంభిస్తున్నారు. ఈ షాపులో చిన్నారులకు కావాల్సిన హెల్త్‌కేర్ ప్రోడక్ట్స్‌తో పాటు వివిధ రకాల ఆకర్షణీయమైన ఆట బొమ్మలు కూడా దొరుకుతాయి. మాగుంట లే అవుట్, బి.వి.నగర్, కొండాయపాలెం సెంటర్, ఇస్కాన్ సిటీ వంటి ప్రాంతాలవాసులు ఇక ట్రంకురోడ్డు దాకా వెళ్ళనవసరం లేకుండా ఈ షాపు అందుబాటులోకి వచ్చింది.




## అఖిల్...

మరపురానివి నీ చిరునవ్వులు...
మరువలేనివి నీ మధురస్మృతులు.

నీ ఊసులు మేమెన్నటికీ మరువం...
మా ఊహలలో నీవెప్పటికీ సజీవం!

జాగ్రత్తరా కన్నా...

ఆప్తులు - ఆత్మీయులు.

## ‘ప్రభా’తం


# పాక్‌కు చెంపదెబ్బ

**ఐక్యరాజ్యసమితి వంటి ప్రపంచస్థాయి వేదికల మీద చెప్పే ప్రతిమాట ఎంతో నిష్పాక్షికంగా, నిర్మలంగా ఉండాల్సింది పోయి, అక్కడ కూడా భారత్‌పై విషం చిమ్మే ప్రయత్నం చేసిన పాక్ చివరికి అభాసుపాలైంది. కశ్మీర్ బాలికలపై భారత్ సైన్యం అకృత్యాలకు పాల్పడుతోందంటూ పాక్ దౌత్యవేత్త ఒక ఫోటోను అందుకు నిదర్శనంగా చూపారు. అయితే, ఆ బాలిక ఫోటో కశ్మీరీ బాలికది కాదని వెల్లడికావడంతో ఆమె కంగుతిన్నారు. దీంతో, ఐరాస వేదికపై పాక్ కుయుక్తికి చెంపదెబ్బ తగిలినట్లయింది.**

దుష్టుల దుష్ప్రచారాలను.. ఒక్కొక్కసారి కొందరు పొరపాటునో గ్రహపాటునో నమ్మితే నమ్మవచ్చుగాక. కానీ, అలాంటి మోసపు మాటలను, ప్రచారాలను అందరూ..అన్నివేళలా నమ్మరు. ఒక్కోసారి ఆ దుష్ప్రచారాలే బెడిసికొట్టి, దుష్టుల నోటికి తాళం పడుతుంది కూడా. ఇటీవల పాక్ విషయంలో జరిగింది ఇదే. అందులోనూ సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి (ఐరాస) వంటి ప్రపంచస్థాయి వేదికల మీద చెప్పే ప్రతి మాట ఎంతో నిష్పాక్షికంగా, నిర్మలంగా ఉండాల్సింది పోయి, అక్కడ కూడా భారత్‌పై విషం చిమ్మే ప్రయత్నం చేసిన పాక్ చివరికి బొక్కబోర్లా పడిపోయింది. ఐరాస సమావేశంలో పాక్ కుయుక్తులను దుయ్యబడుతున్న భారత విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రసంగపు ధాటిని ఎదుర్కోవాలనే తత్తరపాటుతో ఐరాస లోని పాక్ దౌత్యవేత్త మలీహా లోథీ తప్పులో కాలేసి అంతర్జాతీయ వేదికపై అభాసుపాలయ్యారు. కశ్మీర్ బాలికలపై భారత్ సైన్యం అకృత్యాలకు పాల్పడుతున్నదనేందుకు ఈ ఫోటోయే నిదర్శనమంటూ లోథీ ఒక బాలిక చిత్రాన్ని చూపారు. ఆ ఫోటోలోని బాలిక ముఖంపై రక్తపు ధారలున్నాయి. ఆ బాలిక కూడా దయనీయంగా ఉంది. ఇంతకంటే భారత్ దౌష్ట్యాలకు నిదర్శనం కావాలా?.. అని నిలదీసి ప్రశ్నించడంతో అందరూ ఒక్కసారి అవాక్కయ్యారు. అయితే, ఆ బాలిక ఫోటో కశ్మీరీ బాలికది కాదని వెల్లడికావడంతో అంతలోనే ఆమె ఖంగుతిన్నారు. ఆ ఫోటో ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన పాలస్తీనాకు చెందిన ఒక బాలికది కావడంతో ఐరాస వేదికపై పాక్ కుయుక్తికి చెంపదెబ్బ తగిలినట్లయింది. అంతేకాదు, ఇంత ఘనమైన తప్పిదంతో పాక్ తన చెంపలు తనే వాయించుకున్నట్లయింది. ఇక ఏమీ చేయాలో అర్థం కాక, మోడీ ప్రభుత్వం మీద అక్కసు వెళ్ళగక్కుతూ, భారత్‌లో మతోన్మాదం పెరిగిపోతోందంటూ మరో దుష్ట ప్రచారానికి తెగబడడం ప్రపంచాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. అయితే, భారత్‌ను పాక్ విమర్శిస్తున్న సమయంలోనే పాక్ నుంచి వచ్చిన ముజాహిర్లు ఐరాస ఎదుట ఆందోళన నిర్వహించడం, పాక్ సైన్యం తమపై అమానుషంగా దాడులు చేస్తోందంటూ వారు నిరసన వ్యక్తం చేయడం యాదృచ్ఛికమే అయినా, దీన్నిబట్టి ఎవరు ఎలాంటివారో..ఎవరిపై ఎవరు దాడులకు దిగుతున్నారో, ఎవరు ఎవరిపై కుట్రలు చేస్తున్నారో ప్రపంచానికి మరోసారి తేటతెల్లమైపోయింది. అయినా,. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్లుగా, పాక్‌కు కనిపించేదంతా ఉగ్రవాదమే. ఉగ్రవాదానికి పుట్టినిల్లయిన పాకిస్తాన్..రాను రాను ఉగ్రవాదిస్థాన్‌గా మారిపోతోన్న వైనాన్ని ప్రపంచమంతా గమనిస్తున్నా, పాక్‌కు మాత్రం చీమ కుట్టినంత బాధ కూడా లేదు. పైపెచ్చు ఉగ్రవాదాన్ని భారత్ పురికొల్పుతున్నదంటూ పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీ భారత్‌పై విషం చిమ్ముతూ చేసిన విమర్శలు ప్రపంచాన్నే నివ్వెరపరిచాయి. ఉగ్రవాద ముష్కరులకు పుట్టుగడ్డగా, అత్యంత భయంకరమైన ఉగ్రవాద విషసర్పాల పుట్టగా ఉన్న పాకిస్థాన్, ఎప్పుడు సందుచిక్కితే అప్పుడల్లా ఉగ్రవాదులను భారత్‌పైకి ఉసికొల్పి, భారత్‌లో మారణహోమాలు, విధ్వంసాలకు పాల్పడే పాక్..అలా శాంతిసూక్తులు వల్లిస్తున్నప్పుడల్లా ప్రపంచం ఆశ్చర్యపోతూనే ఉంది. భారత్ అంటేనే శాంతిదేశంగా, ప్రపంచశాంతిని కోరుకునే పవిత్రదేశంగా ఉన్న మనదేశాన్ని అల్లకల్లోలం చేయాలని పాక్ ఎంతోకాలంగా ప్రయత్నిస్తూనే ఉందనేది ప్రపంచానికంతటికీ తెలిసిన విషయమే. భారత్‌లో అంతర్భాగంగా ఉన్న కశ్మీర్‌ను కబళించాలనే కుయుక్తులతో, కపటనాటకాలతో పాక్‌లోని ఉగ్రవాదుల్ని కశ్మీర్‌కు పంపి తద్వారా కశ్మీర్‌ను కల్లోలం చేస్తోంది. మానవబాంబులు, మారణహోమాలు, అరాచకాలు, సాధారణ ప్రజల్ని సైతం మట్టుపెట్టడాలూ వంటి ఉగ్రవాదపు ఉన్మాద చేష్టలు పాక్‌కు పుట్టుకతో అబ్బిన విద్యలు. ఉగ్రవాద పిశాచం నెత్తుటిధారల కోసం కోరలు చాస్తోంటే, దానికి నెత్తురు పోసి పెంచుతూ భారత్‌పైకి ఉసిగొల్పడమే పాక్ నిత్యకృత్యమైపోయింది. భారత్ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చి, కాల్పుల విరమణ ఒప్పందాన్ని సైతం నవ్వులపాలు చేస్తూ ఎన్నోసార్లు పాక్ తన దుందుడుకు తత్వాన్ని ప్రదర్శించింది. ఆ ఉగ్రవాదుల్ని తరిమేందుకు భారత్ ప్రయత్నిస్తే మాత్రం, భారత్ నియమాలను ఉల్లంఘిస్తోందంటూ లేనిపోని దుష్ప్రచారం. అందుకే, ఇటీవల ఐరాసలో పాక్ వైఖరిని భారత్ తీవ్రంగానే నిరసించింది. అంతర్జాతీయ ఉగ్రవాదానికి అసలైన రూపం పాకిస్థానేనని చాటింది. అంతేకాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్ ఉగ్రవాదానికి అడ్డాగా మారిందని, బెలూచిస్థాన్‌లో పాక్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని భారత్ స్పష్టం చేసింది.

సకల మానవాళికీ పెనుముప్పుగా మారిన ఉగ్రవాద రాకాసి ఎక్కడున్నా దాని అంతం చూడాలని పంతం పట్టిన భారత ప్రధాని మోడీ ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదంపై సమిష్టి పోరుచేయాలని ఇస్తున్న పిలుపుకు ప్రపంచమంతా స్పందిస్తుంటే.. పాక్ మాత్రం ఆ సమస్యను పక్కదారి మళ్ళిస్తూ, భారత్‌పై లేనిపోని విమర్శలు చేస్తూనే ఉంది. అందుకే, ఐరాస వేదికపై పాక్ ప్రధాని అబ్బాసీ ప్రసంగాన్ని ఖండిస్తూ, ఐరాసలోని భారత ప్రతినిధి ఈనం గంభీర్ పాక్ నైజాన్ని కుండబద్దలు కొట్టినట్లు బట్టబయలు చేశారు. “ఒసామా బిన్ లాడెన్, ముల్లా ఉమర్‌వంటి ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన పాక్ బాధితపాత్రను పోషించడం విడ్డూరం. జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎంతగా ఎగదోసినా భారత ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగించడం పాక్ తరం కాదు”.. అంటూ ఈనం గంభీర్ తనదైన ధీరగంభీర స్వరంతో స్పష్టం చేసి అందరి ప్రశంసలందుకున్నారు. అంతేకాదు, “పాక్ వీధుల్లో ఉగ్రవాదులు స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. విఫల దేశంగా ముద్రపడిన వారినుంచి ప్రజాస్వామ్యం, మానవహక్కుల గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అగత్యం ప్రపంచానికి లేదు”... అంటూ గంభీర్ ఈ సందర్భంగా సూటిగా.. ధీటుగా స్పష్టం చేశారు. ఇంతకంటే పాక్‌కు ఎవరు మాత్రం ఏం చెప్పగలరు?..

# ఘనంగా శ్రీ సత్యానంద మహర్షి పుణ్యారాధన



కోవూరు మండలంలోని ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఈ నెల 24న సద్గురు శ్రీ సత్యానంద మహర్షులవారి 21వ పుణ్యారాధన కార్యక్రమాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనేకమంది స్వామీజీలు, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ సత్యానంద మహర్షుల వారిని స్మరించుకుంటూ నీరాజనాలర్పించారు. ఆశ్రమంలో కొలువైవున్న తారకేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. శ్రీహరితీర్థస్వామి ప్రసంగిస్తూ, ఈ ఆశ్రమ వ్యవస్థాపకులు, భగవద్గీతామృత తరంగిణి వ్యాఖ్యాన కర్త, సద్గురు శ్రీ సత్యానంద మహర్షి వైశిష్ట్యాన్ని, ఆయన బోధనలను భక్తులకు వివరించారు. భగవద్గీతలోని భావాలను వివరిస్తూ, గీత అర్థాన్ని-పరమార్థాన్ని భక్తులకు ప్రబోధించారు. అనంతరం అనేక అంశాలపై మహాత్ముల ప్రవచనాలు జరిగాయి. శ్రీ రామకృష్ణానందాశ్రమ అధ్యక్షులు శ్రీ కృష్ణానందగిరి స్వాముల వారు ధర్మం, జ్ఞానం, వైరాగ్యం అనే అంశాలపై ప్రసంగించారు. ఆశ్రమ ఆస్థాన పండితులు డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు మహర్షులచే పేర్కొన్న గృహస్థాశ్రమ ధర్మాలను భక్తులకు సుబోధకం చేశారు. నిజామాబాద్ జిల్లా పిప్రి ఆశ్రమ అధ్యక్షులు శ్రీ మాతా పరమేశ్వరి మాట్లాడుతూ, పూజ్యులను గౌరవించుకోవాలని, మహాత్ముల సంకల్పంతో అన్నీ నెరవేరతాయని అన్నారు. విశ్రాంత సంస్కృతోధ్యాపకులు, అవధాని విద్వాన్ కోట రాజశేఖర్ మాట్లాడుతూ, 302 శ్లోకాలతో వున్న ‘ఉపదేశ రత్నావళి’లో శ్రీ సత్యానంద మహర్షులవారు వివరించిన ధర్మ, జ్ఞాన విషయాలను భక్తులకు వివరించారు. విఆర్‌కళాశాల రిటైర్ట్ లెక్చరర్ మెట్టు రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ, భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని విశదీకరించారు. అనంతరం శ్రీహరి తీర్థస్వాములవారు వక్తలందరినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పురుషోత్తమ బ్రహ్మచారి తదితర స్వామీజీలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సుదర్శనయాగం

నెల్లూరు వెంకటేశ్వరపురంలో కొలువై వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 24న సుదర్శనయాగం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ యాగంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాయిభరద్వాజ్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. ఈ యాగానికి పి.రామమూర్తి, ప్రసాద్, వెంకట్రావ్, రవికుమార్, శ్రీలత ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.




# విషం కక్కడమే పనా?

కొన్ని మీడియా సంస్థలు హిందూ సంస్కృతిపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నట్లున్నాయి. హిందూ వ్యతిరేక శక్తులను ఎగదోస్తున్నాయి. కంచె ఐలయ్య అనే ప్రొఫెసర్ హిందూ వ్యతిరేకి. అదే పనిగా విషం చిమ్ముతుంటాడు. అతను విశ్వసించిన క్రిస్టియన్ మతం గురించి ప్రచారం చేసుకుంటే తప్పులేదు. ఇంకో సంస్కృతి మీద విపరీత వ్యాఖ్యలు చేయడం, కొన్ని టీవీలు ఆయనకు విపరీతమైన ప్రచారమివ్వడం సిగ్గు చేటు. ముఖ్యంగా హిందూ వ్యతిరేక కథనాలను అల్లుతున్న టీవీ9 వంటి ఛానెల్స్‌ను హిందువులందరూ చూడడం మానుకోవాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# పొగరుబోతు ఐలయ్య

ఏదో విధంగా మీడియాకు ఎక్కి ప్రాచుర్యం పొందాలనుకునేవారిలో ఐలయ్య ఒకడు. అగ్రవర్ణాల పట్ల విద్వేషంతో ఉంటున్నాడు. అసలు అగ్రకులాల ఆధిపత్యంపై అతను తిరగబడి వుండొచ్చు కదా! సమాజంలో కుల వైషమ్యాలను రూపుమాపాలనుకునే వాళ్ళు ఇతర కులాల పట్ల ద్వేషం పెంచుకోరు. కుల భావనలను రూపుమాపేందుకు ప్రయత్నిస్తారు. కంచె ఐలయ్య ప్రొఫెసర్. విద్యార్థులను కులాల రొచ్చులో పడకుండా విద్యాబోధన చేయొచ్చు. కాని ఐలయ్య ఆ పని చేయకుండా తన చాదస్తంతో వివాదాలు రేపుతున్నాడు.

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# చరిత్రను మరువ వద్దు

మయన్మార్ నుండి వలసవస్తున్న రోహింగ్యా ముస్లింలకు ఆశ్రయం కల్పించాలంటూ పిడి వాదులు వాదిస్తున్నారు. ఏ జాతి వారిమీదైనా, ఏ మతం వారిమీదైనా మారణకాండను ఖండించాల్సిందే! అయితే ఆయా దేశాల శరణార్దులకు భారతదేశం శిబిరంగా మారితే ఆ తర్వాత భారతీయులే శరణార్థులు కావాల్సి వస్తుంది. గత చరిత్ర నేర్పిన అనుభవాలతోనైనా మనం జాగ్రత్తపడాల్సిన అవసరముంది. బంగ్లాదేశ్ నుండి వచ్చిన చొరబాటుదారులతో మనం పశ్చిమబెంగాల్, అస్సాం, రాష్ట్రాలలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాం. జమ్మూ కాశ్మీర్‌లో భారతీయ పండిట్‌లే శరణార్థులుగా మారి వలసవచ్చి ఢిల్లీ రోడ్లపై దయనీయ స్థితిలో బ్రతుకుతున్న చరిత్రను చూసాం. మన దేశానికి వున్న జనాభానే ఎక్కువ. రోహింగ్యా ముస్లింలతో దేశ భద్రతకు ముప్పుందని సుప్రీం కోర్టుకు కేంద్రం నివేదిక ఇవ్వడం అభినందనీయం. చొరబాట్లు, శరణార్థుల విషయంలో మనం కఠినంగా ఉండాల్సిందే!

**కె.విశ్వరూపాచారి, నెల్లూరు.**

# వన్నె తగ్గని సోమిరెడ్డి

**పొలిట్‌బ్యూరో పదవి పదిలం**
**రాష్ట్ర కమిటీలో జిల్లా నుండి 5మంది**





*తెలుగుదేశం పార్టీలో ఇచ్చిన బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వర్తిస్తూ శత్రు శిబిరాలలోనూ జొరబడి తమ పార్టీ జెండాను ఎగురవేయిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పార్టీలో తిరిగి పూర్వవైభవం లభిస్తోంది. మొన్న కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గెలుపు... నిన్న నంద్యాల ఉపఎన్నికల విజయం... పార్టీలో సోమిరెడ్డి అవసరాన్ని గుర్తించేలా చేసాయి. ఆయన అనుభవానికి తగిన ప్రాధాన్యత లభించింది.*

తెలుగుదేశం కీలక రాజకీయ విభాగమైన పొలిట్‌బ్యూరోలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మరోసారి స్థానం దక్కింది. రాష్ట్రంలో పార్టీకి వున్న రాజకీయ వ్యూహకర్తలలో ఆయన ఒకరు. మొన్న నంద్యాల ఉపఎన్నికల్లో ఆయన వ్యూహాలే ఎక్కువుగా ఫలించాయి. పొలిట్‌బ్యూరోలో ఆయన ఉండడం ఎంతైనా అవసరమని భావించే చంద్రబాబు ఆయనను మళ్ళీ తీసుకున్నాడు.

ఇక జిల్లా నుండి రాష్ట్ర కమిటీలో మరో అయిదుగురికి పదవులు దక్కాయి. ఒకటిన్నర ఏడాది క్రితం పార్టీలో చేరిన ఆనం రామనారాయణ రెడ్డికి పార్టీ ప్రధానకార్యదర్శి బాధ్యత అప్పగించారు. పార్టీలో చేరాక ఆయనకు ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యత మాత్రమే ఇచ్చారు. ఇటీవల గూటూరు కన్నబాబు వైఖరితో ఆయన అసంతృప్తిగా వున్నాడు. మొన్న చంద్రబాబును కలిసి తన బాధ చెప్పుకున్నాడు. పార్టీలో ఆనంకు సముచిత స్థానం కల్పించాలనుకున్న చంద్రబాబు ఆయనను ప్రధాన కార్యదర్శిని చేశాడు.

అలాగే మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధను పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ఈమె కూడా నామినేటెడ్ పదవి ఇవ్వలేదని చాలాకాలం నుండి అసంతృప్తితో వుంది. సీనియర్ న్యాయ వాది దేశాయిశెట్టి హనుమంతురావు, మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకుడు చేవూరు విజయ మోహన్‌రెడ్డిలను పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించారు.

మొత్తానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో నెల్లూరుజిల్లా నాయకులకు తగిన గుర్తింపు లభించిందనే అనుకోవచ్చు.

# ప్రజలకు ఉత్తమసేవలు అందించాలి

**- పోలీసులకు జిల్లాఎస్పీ సూచన**



జిల్లాలోని పోలీసులు ప్రజలకు ఉత్తమసేవలందించాలని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పోలీసులకు సూచించారు. ఈ నెల24న నెల్లూరులోని ఉమేష్ చంద్ర సమావేశమందిరంలో ఆయన డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో సమావేశమై పోలీసులకు తగు సూచనలు చేశారు. పోలీసులు ప్రజలతో స్నేహపూరితంగా మెలగాలని, ప్రజల్లో పోలీసులు పట్ల ఉన్న అభిప్రాయం మారేలా ప్రజలతో వ్యవహరించి సేవలందించాలని సూచించారు. జిల్లాలో రౌడీయిజం, దౌర్జన్యాలు వగైరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసులు ధైర్యంగా, నిజాయితీగా తమ విధులు నిర్వహించాలన్నారు. బెట్టింగ్‌లు, అక్రమ వ్యాపారాలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని నిలువరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు, దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు గట్టిగా కృషి చేయాలన్నారు. ఇటీవల పోలీసులపై కొందరు దాడులకు పాల్పడడం దురదృష్టకరమని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే కేసులను విచక్షణతో పరిశీలించి కేసులు నమోదు చేయాలని, ఎవరిపైనా అసత్య కేసులు పెట్టవద్దని, అమాయకులను అరెస్టు చేయవద్దని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు శరత్‌బాబు, వీరభద్రుడు, క్రైమ్ ఓఎస్డీ విఠలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కిలారీ...
# ఇది కామెడీగా లేదూ...!

**పాతవారికి కాకుండా పార్టీ మారివచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ పార్టీ మారివచ్చిన నాయకులకే ఫిర్యాదా?**





రాష్ట్రంలో ఒరిజినల్ తెలుగుదేశం అన్నది లేదు. ఉన్నదల్లా తెలుగు కాంగ్రెస్ పార్టీయే! ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సహా పార్టీ నాయకుల్లో 90శాతం మందిది కాంగ్రెస్ రక్తమే! ఒకరుఅరా వేనాటి రామచంద్రారెడ్డి, టి.రమేష్‌రెడ్డి లాంటివాళ్ళు తప్పితే పార్టీ మారకుండా 1983 నుండి తెలుగుదేశాన్నే కనిపెట్టుకుని వున్నవాళ్ళు టార్చ్‌లైట్ వేసి వెదికినా కనిపించరు. దాదాపు తెలుగుదేశంలో ప్రస్తుతమున్న నాయకులందరు కూడా ఇతర పార్టీల నుండి వచ్చినవాళ్ళే! కాకపోతే కొందరు ముందు... కొందరు వెనుక.

సెప్టెంబర్ 24వ తేదీన నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సమన్వయ కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు తన మనసులో బాధను వెళ్లగక్కారు. నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయన ఇంట్లోనే రూరల్ నియోజకవర్గ సమావేశాలు పెట్టుకుంటున్నాడని ఫిర్యాదు చేశారు. అంతేకాదు, పార్టీని ఎప్పటి నుండో కనిపెట్టుకుని వున్న మాలాంటి వారిని కాదని పార్టీ మారివచ్చిన వాళ్ళకు ప్రాధాన్యతనిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఆయన ఈ ఫిర్యాదు చేసింది ఎవరికి? మొన్న ఎన్నికల్లో వైసిపి నుండి గెలిచి తెలుగుదేశంలో చేరి మంత్రి అయిన ఎన్.అమర్‌నాథ్‌రెడ్డికి. మంత్రి అయ్యేవరకు పార్టీ కార్యాలయం ముఖం చూడని మంత్రి పి.నారాయణకు... అంతేనా... అక్కడ కాంగ్రెస్ నుండి వచ్చిన ఆనం రామనారాయణరెడ్డి, వైకాపా నుండి జంప్‌చేసిన అబ్దుల్‌అజీజ్‌లు కూడా వున్నారు. ఇక ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు కూడా పార్టీలు మారినవాళ్ళే! అంతెందుకు కిలారి వెంకటస్వామినాయుడు కూడా కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరినోడే! కాబట్టి పార్టీలో పాత, కొత్త, సీనియారిటీ, సిన్సియార్టీలకు ఎప్పుడో కాలం చెల్లింది. ఇది కిలారి గమనించాలి.

# సేవల్లో శ్రీసిటీ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి పురస్కారం

సి.యస్.ఆర్ రంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా శ్రీసిటీ ఫౌండేషన్‌కు 'నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ సి.యస్.ఆర్' పురస్కారం లభించింది. ఇటీవల బెంగుళూరులో 'నేషనల్ సియస్ఆర్ లీడర్షిప్ కాంగ్రెస్' ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, మై బ్రైన్ ఇంటర్నేషనల్, సంచాలకులు అలిస్టైర్ స్కాఫీల్డ్ చేతులమీదుగా శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం ఈ పురస్కారాన్ని అందుకున్నారు.




అరుదైన పురస్కారం లభించినందుకు సంతోషం వ్యక్తంచేసిన శ్రీసిటీ నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఒక ప్రాంతం యొక్క సాంఘిక, ఆర్ధిక పరిస్థితులను, ఒక సెజ్ ఏ విధంగా ప్రభావితం చేసి, ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను ఏవిధంగా మెరుగు పరచగలదన్నదానికి నిలువెత్తు నిదర్శనం శ్రీసిటీ అని, శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర గ్రామాభివృద్ధి కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించినందుకు ఆనందంగా వుందన్నారు. మన దేశంలో సి.యస్.ఆర్ రంగంలో మంచి సేవలందించే సంస్థలకు, వ్యక్తులకు ప్రోత్సాహాన్నిచ్చేందుకు, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకై , నేషనల్ సి.యస్.ఆర్ లీడర్షిప్ కాంగ్రెస్, ఏషియన్ కన్ఫెడరేషన్ ఆఫ్ బిజినెస్ సహకారంతో వార్షిక పురస్కారాలనందిస్తోంది. ఈ సంవత్సరం పురస్కారం శ్రీసిటీకి లభించడం అభినందనీయం.

# ప్రమాదకరంగా హోర్డింగ్‌లు



నెల్లూరు నగరంలో కుప్పలు తెప్పలుగా హోర్డింగ్‌లు వున్నాయి. గతంలో రోడ్ల పక్కన విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. నగరంలో చాలా భవనాల మీద భారీ హోర్డింగ్‌లు పెట్టివున్నారు. మామూలు రోజులలో అయితే పెద్ద ఇబ్బంది వుండదు. ఇప్పుడు వర్షాలు, గాలుల సీజన్. ఈదురుగాలులు వీచినప్పుడు ఇవి కూలి రోడ్డునపోయే వారిమీద పడే అవకాశముంది. మొన్న రైల్వేస్టేషన్ రోడ్డులో ఇలాగే ఒక హోర్డింగ్ కూలి నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. హోర్డింగ్‌లను పటిష్టంగా, ఈదురుగాలులకు తట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలి. కాని, అన్ని హోర్డింగ్‌లను అలా ఏర్పాటు చేసి వుండరు. ప్రమాదకరంగా వున్న హోర్డింగ్‌లను తొలగించడానికి కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.




## నెల్లూరు కబుర్లు

# నెల్లూరుకు ఉపరాష్ట్రపతి



భారత ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసాక తొలిసారిగా వచ్చే నెల 4వ తేదీన ముప్పవరపు వెంకయ్య నాయుడు నెల్లూరుజిల్లా పర్యటనకు వస్తున్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాక ఆగస్టు 5వ తేదీన నెల్లూరు, వి.ఆర్‌సి మైదానంలో జరిగిన మన వెంకయ్యకు ఆత్మీయ అభినందన కార్యక్రమానికి ఆయన హాజరు కావడం తెలిసిందే!

3వ తేదీ ఉదయం ఢిల్లీ నుండి బయలుదేరి ఆయన విజయవాడకు చేరుకుంటారు. ఆ రోజంతా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 3వ తేదీ రాత్రికి అక్కడే బసచేస్తారు. 4వ తేదీ ఉదయం 9గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరుతారు. 9.45 గంటలకు తిరుపతి విమానాశ్రయంలో దిగుతారు. 10గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి శ్రీహరికోటలోని షార్ సెంటర్‌కు చేరుకుంటారు. షార్‌ను సందర్శించిన అనంతరం షార్ శాస్త్రవేత్తలతో సమావేశమవుతారు. అక్కడ నిర్వహించే ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం భోజనం అక్కడే చేసి 3.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.50గంటలకు నెల్లూరులోని పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకుంటారు. కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించే ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 49వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అలాగే కొండాపురం మండలం చింతలదేవిలో ఏర్పాటు చేయనున్న కామధేను ప్రాజెక్టును ఇక్కడనుండే ప్రారంభిస్తారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన వెంటనే హైదరాబాద్‌కు గాని, ఢిల్లీకి గాని బయల్దేరి వెళతారు. ఆరోజు వీలునుబట్టి ఆయన ఇక్కడనుండి ఎక్కడకు వెళ్లేది ఖరారుకానుంది. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది.

# జడ్పీలో క్యాంటిన్



నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాయంలో ఎట్టకేలకు క్యాంటిన్‌ను ప్రారంభించారు. జడ్పీ నూతన భవనంలో క్యాంటిన్‌ను ఎప్పుడో నిర్మించారు. అయితే వ్యాపారం సరిగా జరగదనే ఉద్దేశ్యంతో దీని నిర్వహణకు ఎవరూ ముందుకురాలేదు. ఈ దశలో జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి చొరవ తీసుకుని తన వద్ద అటెండర్‌గా పనిచేసి ఇటీవలే రిటైర్డ్ అయిన రామ్మూర్తికి క్యాంటిన్ నిర్వహణ బాధ్యత అప్పగించారు. జడ్పీ ఛైర్మెన్ రాఘవే ఆ క్యాంటిన్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించారు.

# గీతాంజలిలో జావా లాంగ్వేజీపై వర్క్‌షాపు



నెల్లూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 22, 23 తేదీలలో జావా లాంగ్వేజీ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల సిఎస్‌ఇ విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ వర్క్‌షాపుకు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన ముఖ్యఅతిథి బెంగుళూరు టెక్‌మహీంద్రలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బి.సుజిత్‌బాబు తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు జావాలోని అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్, ప్రోగ్రామింగ్, ఇంటర్వ్యూకి అవసరమైన టెక్నికల్ ప్రిపరేషన్‌కు సంబంధించిన మెళకువలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌ఇ విభాగాధిపతి డా॥ వై.జాహ్నవి, కార్యక్రమ సమన్వయకర్త పి.రాధిక, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిల్లులు తీసుకోండి

## జిఎస్‌టి జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



కొనుగోలుదారులు తాము కొన్న వస్తువులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని జిఎస్‌టి జాయింట్‌కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులోని జిఎస్‌టి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలామంది డీలర్లు, ట్రేడర్లు కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, బిల్లులు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడినట్లు ఋజువైతే 10వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇలా అక్రమాలకు పాల్పడ్డ 13 దుకాణాల నుండి లక్షా30వేల రూపాయలు జరిమానాలు వసూలు చేసినట్లు చెప్పారు. కొనుగోలుదారులు బిల్లులు తీసుకోవాలి, అమ్మకందారులు ఇవ్వాలి. దేశానికి సక్రమంగా పన్నులు చెల్లించడానికి ఇవి ఎంతో అవసరం. ఎవరైనా బిల్లులు ఇవ్వకుంటే జిఎస్‌టి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను, పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

# డిపిఆర్‌ఓగా సరళాదేవి



జిల్లా పౌరసంబంధాల అధికారిణిగా ఎం.సరళాదేవి బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డివిజన్ పిఆర్‌ఓగా వున్న ఆమెకు పదోన్నతి కల్పించి డిపిఆర్‌ఓగా నియమించారు. ఇక్కడ డిపిఆర్‌ఓగా వున్న మనోరంజన్ సమాచారాశాఖ ఏ.డిగా పదోన్నతిపై రాజమండ్రికి బదిలీ అయ్యారు. గుంటూరుకు చెందిన సరళాదేవి గతంలో గుంటూరు, ప్రకాశం జిల్లా కందుకూరు, నెల్లూరుజిల్లాలో గూడూరు, నెల్లూరులలో డివిజన్ పిఆర్‌ఓగా సేవలందించారు.

# లక్ష్మణ్‌కుమార్‌కు డిఎస్పీగా పదోన్నతి



నెల్లూరు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 24వ తేదీన ఇటీవల డిఎస్పీగా పదోన్నతి పొందిన లక్ష్మణ్‌కుమార్‌కు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పదోన్నతి పత్రాన్ని అందజేశారు. లక్ష్మణ్‌కుమార్ గతంలో స్పెషల్ పార్టీ కూంబింగ్ అధికారిగా, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా, వెల్ఫేర్, అడ్మిన్ ఆర్‌ఐగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం నెల్లూరు ట్రాఫిక్ విభాగంలో నాలుగు సంవత్సరాలు పనిచేశారు. జిల్లా పోలీస్ శిక్షణ కళాశాలలో పనిచేస్తున్న క్రమంలో పదోన్నతి లభించింది. ఇప్పటివరకు లక్ష్మణ్‌కుమార్ 162 రివార్డ్స్, 14 ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ బి.శరత్‌బాబు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ వీరభద్రుడు, అధికారులు పాల్గొన్నారు.

# గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం




గుండె వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా వుందని నెల్లూరుజిల్లా ఎస్పీ రామకృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి, స్పోర్ట్స్ జిమ్, ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 24వ తేదీన అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఏసి స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. కిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్యనిపుణులు సి.ఎస్.శ్రీనివాసరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏసి స్టేడియంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ గుండె ఎంత ఆరోగ్యంగా పనిచేస్తుందో మనిషి అంత ఆరోగ్యంగా ఉంటారన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. గుండె వైద్య నిపుణులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ గుండె ఎంతో పదిలమని, దానిని జాగ్రత్తగా కాపాడుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. గుండె వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, వాకర్స్ బి.మనోహర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీవో సంఘంలోకి వీఆర్వోలు

వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నెల్లూరు ఎన్జీవో భవన్‌లో 528 మంది గ్రామ రెవెన్యూ అధికారులు ఎన్జీవో అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్జీవో సంఘంలో చేరికతో వీఆర్వోల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందన్నారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఏపిజెఏసి జిల్లా ఛైర్మెన్ శేఖర్‌రావు మాట్లాడుతూ వీఆర్వోల నిర్ణయం ఆనందదాయక మన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ఎన్జీవో అసోసియేషన్ ముందుంటుందని తెలిపారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.రమణారెడ్డి, కోశాధికారి బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి ర్యాలీకి ఘనస్వాగతం

ఉగ్రవాదులు, అసాంఘిక శక్తుల మూలంగా జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జి) చెన్నై నుండి ఢిల్లీ వరకు తలపెట్టిన బైక్ శాంతి ర్యాలీ ఈ నెల 22న నెల్లూరుకు చేరింది. జిల్లా సరిహద్దుల్లో పోలీసులు వారికి స్వాగతం పలికారు. హైవే పొడవునా అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బంది వీరి భద్రతను పర్యవేక్షించారు. నెల్లూరులో అయ్యప్పగుడి నుండి రంగనాయకులపేట వరకు జరిగిన శాంతి ర్యాలీకి ప్రజలు స్వాగతం పలికారు. కమాండోలకు అభిమానపూర్వక వందనం చేశారు.

## శిక్షణ పొందండి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూ శిక్షణ పొందని ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణ ఇవ్వాలని రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసారని, ఈమేరకు ఉపాధ్యాయులు ఈ నెల 30వ తేదీలోగా సిఐఇఎస్/ఎన్ఐఓఎస్ పోర్టల్‌నందు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖాధికారి కె.వి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

## పిఎం ఇళ్లపై అలసత్వం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అందరికీ ఇళ్లు ప్రధానమంత్రి అవాస్ యోజన(అర్బన్) పథకంపై అధికారులు అలసత్వం చూపిస్తున్నారని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కరణం భాస్కర్ ఒక ప్రకటనలో విమర్శించారు. 2017–18 సంవత్సరానికి సంబంధించి అధికారులు జాబితా తయారు చేయలేదు. డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్, అంచనాలు తయారు చేయలేదు. ఇప్పటికే ఆరునెలల కాలం గడిచిపోయింది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఈ పథకం కోసం 5వేల మంది నమోదు చేసుకుని వున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఈ పథకాన్ని ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని ఆయన కోరారు.

## రొట్టెల పండక్కి..
# పకడ్బందీ ఏర్పాట్లు

**- కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**



అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు జరగనున్న బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు వివిధ శాఖాధిపతులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రొట్టెలపండుగ ఏర్పాట్లను ఆయన సమీక్షించి మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అధికారులు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వెంటనే తగిన ప్రతిపాదనలు తనకు పంపాలన్నారు. తమ శాఖకు కేటాయించిన విధులను నిబంధనలు పాటించి వివిధ పనులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బారికేడ్లు, పెయింటింగ్, లైటింగ్, జనరేటర్లు ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. పండుగ నిర్వహించే 5రోజుల్లో ఏర్పాట్ల పర్యవేక్షణకు సి.సి. కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి చెరువులో నీరు సమృద్ధిగా వుండాలని, కనీసం 12 నుండి పన్నెండున్నర అడుగుల నీటిని భక్తులకు అందేలా చూడాలని ఆయన సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ ఉండేలా జనరేటర్లు ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ అంబులెన్స్‌లు, పారామెడికల్ సిబ్బందిని సిద్ధంగా వుంచాలని ఆయన సూచించారు. అందుకు రెడ్‌క్రాస్, ఎన్‌జిఓలు, వాలంటీర్ల సహాయం తీసుకోవాలని తెలిపారు. బోట్లు, లైఫ్‌జాకెట్లు, కనీసం 50మంది గజఈతగాళ్ళను నియమించుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గత ఏడాది 80బస్సులను ఏర్పాటు చేసిందని, ఈ ఏడాది 100 బస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిఐపిల రాకపోకలను జిల్లా పర్యాటకశాఖ అధికారి సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. మొత్తం కార్యక్రమాలన్నీ మున్సిపల్ కమిషనర్, నెల్లూరు ఆర్‌డిఓ పర్యవేక్షణలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పోలీసుశాఖ తరపున చేపట్టే వివిధ కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు, నెల్లూరు ఆర్‌డిఓ హరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంచిరోజులని చెప్పి...
# ప్రజలను ముంచుతున్నారు

**- పనబాక కృష్ణయ్య**



దేశానికి 'అచ్చేదిన్' అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలను వంచించడమే పనిగా పెట్టుకుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య విమర్శించారు. 25వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా చమురుధరలు తగ్గినా, ప్రజలపై రోజువారీ పన్నులు పెంచుతున్నారని, అచ్చేదిన్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు 2014-2017 మధ్యలో 50శాతం తగ్గాయి. కాని, మన దేశంలో ఆమేరకు చమురు ధరలు తగ్గించడం లేదు. యూపిఏ ప్రభుత్వ హయాంలో ముడిచమురు బ్యారెల్ ధర 110 డాలర్లు వుంటే లీటర్ పెట్రోల్ 76 రూపాయలు, డీజిల్ 61రూపాయలకు ఇచ్చాం. ఇప్పుడు బ్యారెల్ ధర 48డాలర్లకు పడిపోయినా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం ఏ మాత్రం తగ్గించడం లేదని, రోజువారీ పెట్రోల్ ధరలతో కేంద్రం ప్రజలను దగా చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా వుంటున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్‌లను కూడా వెంటనే జిఎస్టీ పరిధిలోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్, ఆసిఫ్‌పాషా, జి.శివాచారి పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధికి ప్రత్యేక చొరవ

**- మంత్రి సోమిరెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అభివృద్ధికి నిధులు కేటాయించి తోడ్పాటునందిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తోటపల్లిగూడూరు డ్వాక్రా భవనం ప్రాంగణంలో పొదుపులక్ష్మి పరస్పర సహాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1995లో మహిళా గ్రూపులను ప్రారంభించి వాటికి ఒక రూపం తీసుకొచ్చారని, ఈ గ్రూపులో వేలకోట్ల రూపాయలు టర్నోవర్ చేసి వడ్డీలేని రుణాలు తీసుకుని మహిళలు ఆర్థికంగా ఎంతో బలపడుతున్నారన్నారు. తోటపల్లిగూడూరులో 1999 సంవత్సరంలో పొదుపులక్ష్మి పరస్పర సహాయ సహకార సంఘం ఏర్పడిందన్నారు. 350 సంఘాలు వుండగా, అందులో సభ్యులు 4200 మంది వున్నారన్నారు. వారు పొదుపు చేసుకున్న మొత్తం మూడు కోట్ల పదిహేను లక్షలు వున్నాయని చెప్పారు. ఇప్పటివరకు 45కోట్ల రూపాయలు రుణాలు పంపిణీ చేశారన్నారు. చంద్రన్న పెట్టుబడి నిధికి ఇప్పటి వరకు 6వేల కోట్ల రుణాలు పంపిణీ జరిగిందని, ఇంకా 4వేల కోట్ల రూపాయలు పంపిణీ కావాల్సి వుందని అక్టోబర్ నెలాఖరు నాటికి పంపిణీ జరిగే అవకాశం వుందన్నారు. జిల్లాలోని మహిళా బ్యాంకు లకు, వడ్డీలేని రుణాలు, స్త్రీ నిధి రుణాలు ప్రభుత్వంతో మాట్లాడి ఏర్పాటు చేస్తా మన్నారు. టి.పి.గూడూరు మండలంలో 63 అంగన్‌వాడి భవనాలు మంజూరు కాగా, 51భవనాలు ప్రోగ్రెస్‌లో వున్నాయని, 12భవనాలు మొదలుపెట్టాల్సి వుందని పేర్కొన్నారు. టి.పి.గూడూరు పంచాయితీ దక్కిలివారిపాళెం తారురోడ్డు నిర్మాణానికి 1 కోటి 82 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. తొలుత మంత్రి పాపిరెడ్డి పాళెంలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామ ప్రజలకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీఛైర్మన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, నెల్లూరు ఆర్‌డిఓ డి.హరిత, ఎ.డి ఉద్యానవనశాఖ ఉమాదేవి, ఏ.డి. వ్యవసాయశాఖ మారుతిదేవి, ఎంఆర్‌ఓ పుల్లయ్య, యంపిడిఓ కె.హేమలత, మాజీ ఎంపిపి బొమ్మి సురేంద్ర, వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్మన్ బాబిరెడ్డి, నీటి సంఘం డైరెక్టర్ ముత్యాల శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌కి మరో విశిష్ట గుర్తింపు

**- తమిళనాడు ఐసిటి అకాడమీలో సభ్యత్వం**




కోట మండలంలోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మరో విశిష్ట గుర్తింపు తెచ్చుకుని, ఇంజనీరింగ్ విద్యలో తన ప్రతిభా పాటవాలు చాటుకుంటోంది. ఇటీవలే తమిళనాడుకు చెందిన ఐసిటి అకాడమీలో ఈ కళాశాలకు సభ్యత్వాన్ని ఇవ్వడం ఎంతో విశేషం. చెన్నైకి చెందిన వర్చూసా పొలారిస్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి ఎస్.కృతివాసన్, ఎం.రాజన్‌లు ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు విచ్చేసి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐసిటి అకాడమీ సభ్యత్వ పత్రాన్ని కళాశాల సంచాలకులు వి.విజయకుమార్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కృతివాసన్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిభా నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉద్యోగాలకు ఎటువంటి ఢోకా లేదన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఆయా కంపెనీల ద్వారా ప్రాంగణ ఎంపికలలో తక్కువమందిని ఎంపికచేసుకుంటున్నారనే అభిప్రాయం సరైనది కాదని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగివుంటే చాలా సులభంగా ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. ఐసిటి అకాడమీ ప్రతినిధి జి.శరవణన్ మాట్లాడుతూ, తమ అకాడమీ గుర్తింపు కలిగిన కళాశాలలకు తమ సంస్థ ద్వారా అనేక ఉపయోగాలున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు ఇక్కడి విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులకు ముఖాముఖి చర్చ కూడా నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను ఈ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. కళాశాల సంచాలకులు డా. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మంచి అవకాశాలను వినియోగించుకునేందుకు తమ కళాశాల ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐసిఇ విభాగాధిపతి డా.హరనాథ్‌రెడ్డి, ఐసిటి కన్వీనర్ డా.మాధవరెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా.కిషంధర్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో ఇక పోలీస్ సబ్ డివిజన్

ఎన్నేళ్ళ నుంచో ప్రతిపాదనలకే పరిమితమై వున్న నాయుడుపేట పోలీస్ సబ్‌డివిజన్ ఎట్టకేలకు ఆచరణ రూపం దాల్చింది. నాయుడుపేట పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. త్వరలో నాయుడుపేట కేంద్రంగా పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటు కానుంది. అలాగే ఒక డిఎస్పీని నియమించనున్నారు. నాయుడుపేట సబ్‌డివిజన్ పరిధిలోకి నాయుడుపేట, పెళ్ళకూరు, డి.వి.సత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాలు రానున్నాయి. ఈ మండలాలన్నీ ఇప్పటివరకు గూడూరు సబ్‌డివిజన్ పరిధిలో వున్నాయి. జిల్లాలో వున్న పోలీస్ సబ్‌డివిజన్‌లలో గూడూరు పెద్దదిగా వుంది. పరిధి ఎక్కువ. షార్ కేంద్రంతో పాటు శ్రీసిటి సెజ్, మాంబట్టు సెజ్, మేనకూరు సెజ్‌లు ఈ సబ్‌డివిజన్ పరిధిలోనే వున్నాయి. దాదాపు 90 కిలోమీటర్ల మేర హైవే ఈ సబ్‌డివిజన్ పరిధిలోనే వుంది. ఇక తడ కుప్పాలలో జాలర్ల గొడవలు నిత్యకృత్యం. జిల్లా నుండి సరిహద్దు రాష్ట్రాలకు జరిగే అక్రమరవాణాను అరికట్టాల్సిన ప్రధాన బాధ్యత కూడా ఈ డివిజన్ పోలీసుల మీదే వుంది. పరిధి పెద్దది కావడంతో డిఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కష్టంగానే వుంటుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తయారుచేసారు. అయితే నాయుడుపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్ అయితే ఏర్పాటయ్యింది గాని, పోలీసు సబ్‌డివిజన్ సాకారం కాలేదు. ఇప్పుడు అది కూడా నెరవేరినట్లయ్యింది.

# భగవంతుని అనుగ్రహంతోనే భక్తికవిత్వం

## 'సద్గురు సాయి సంకీర్తనం' సిడి ఆవిష్కరణోత్సవంలో వెన్నెలకంటి



కవిత్వం ఒక వరమని, అందులోనూ భక్తి కవిత్వం భగవంతుని అనుగ్రహంతోనే సిద్ధిస్తుందని ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ అన్నారు. ఈ నెల 23న నెల్లూరులోని టౌన్‌హాల్ ప్రాంగణంలో ఉన్న రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారక భవనంలో ప్రముఖ రంగస్థల, సినీనటుడు యస్‌యల్ నరసింహం (శ్రీధర లక్ష్మీనరసింహం) రచించిన 'సద్గురు సాయి సంకీర్తనం' భక్తి గీతాల ఆడియో క్యాసెట్ ఆవిష్కరణోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెన్నెలకంటి మాట్లాడుతూ, సాయినాధుని పట్ల అనన్య భక్తితో యస్‌యల్ రచించిన గీతాలు ఆద్యంతం ఎంతో మధురమైనవని, భక్తిభావరస స్ఫోరకంగా ఉన్న ఈ గీతాలు భక్తులను బాగా ఆకట్టుకుంటాయని అన్నారు. దాదాపు ఎనిమిది పదుల వృద్ధాప్యంలో యస్‌యల్ ఈ గీతాలను అత్యద్భుతంగా రచించి ఆ సాయినాధుని సేవలో పునీతమవుతుండడం ఎంతో విశేషమన్నారు. భక్తిలో నుంచే కవిత్వం వస్తుందని అంటూ, యస్‌యల్ నరసింహం ఈ భక్తిగీతాలను రచించడం సాక్షాత్తూ ఆ షిరిడీ సాయినాధుని అనుగ్రహం వల్లనేనని తాను భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమానికి తొలుత జ్యోతి వెలిగించి సభను ప్రారంభించిన 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, సద్గురు సాయినాధుని కీర్తిస్తూ ఇప్పటి వరకు ఎన్నో వేల పాటలు వచ్చాయని అంటూ, యస్‌యల్ నరసింహం రచించిన గీతాలు అందరినీ ఎంతో ఆకట్టుకునే విధంగా హృద్యంగా ఉన్నాయని కొనియాడారు. ఆ గీతాలను మృదుమధురంగా గానం చేసిన టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, ప్రముఖ గాయనీ గాయకులు కొట్రా సరస్వతీప్రసాద్, పి.రమణవాణి, సంగీత దర్శకుడు భరద్వాజ్‌లు ఎంతైనా అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్‌కె స్కూల్ అధినేత, గురుబ్రహ్మ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ, సాయినాధునిపై ఎంతో భక్తితో యస్‌యల్ నరసింహం రచించిన భక్తిగీతాలు ఆ సాయినాధుని తత్వాన్ని, మహత్వాన్ని లోకానికి చాటుతాయన్నారు. సాయినాధుని నిత్యం భక్తిశ్రద్ధలతో పూజించుకునేవారికి ఎంతో క్రమశిక్షణ, చిత్తశుద్ధి అలవడుతాయన్నారు. ఓయస్డీ (క్రైమ్స్) తిరుపతి పాండురంగ విఠలేశ్వర్ మాట్లాడుతూ, సద్గురు సాయినాధుని సేవ ఒక మహాభాగ్యమన్నారు. షిర్డీ సాయినాధుని సేవిస్తే జీవితం ధన్యమవుతుందన్నారు. అనంతరం 'సద్గురు సాయి సంకీర్తనం' ఆడియో సి.డిని గురుబ్రహ్మ పి.కృష్ణమూర్తి ఆవిష్కరించగా, ఆవిష్కరణకు విచ్చేసిన అతిధులందరూ ఆ గీతాల విశిష్టతను వివరిస్తూ ప్రసంగించారు. ఆ తర్వాత శ్రీధర కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో యస్‌యల్ నరసింహంకు ఆత్మీయంగా సన్మానపత్రం బహుకరించి, శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చివరగా, గీతరచయిత యస్‌యల్ నరసింహం మాట్లాడుతూ, ఈ భక్తిగీతాల్లోని ప్రతి అక్షరం ఆ సాయినాధుని కరుణా కటాక్షమేనన్నారు. ఏదీ తనది కాదని, అంతా ఆ సర్వాంతర్యామి సాయినాధుని కృపేనని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించినవారికి, అందుకు సహకరించిన స్నేహితులు, కుటుంబసభ్యులకు, గాయనీగాయకులకు అందరికీ ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని వై.శేషగిరీశం నిర్వహించగా, సీడీలోని గీతాలను ఆలపించిన కొట్రా సరస్వతీప్రసాద్, పి.రమణవాణి, సంగీతదర్శకుడు భరద్వాజ్ పాల్గొని ప్రసంగించారు. శ్రీధర కుటుంబసభ్యులు డా.ఎం.సుబ్రహ్మణ్యం-రజని దంపతులతో పాటు, నగర ప్రముఖులు డాక్టర్ మధుసూదనశాస్త్రి, పోస్టల్ సూపరింటెండెంట్ టి.విశ్వనాధం, మద్రాస్ ఆంధ్రా క్లబ్ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ రఘురామయ్య, డాక్టర్ దేవసేన, డా.చీమకుర్తి వెంకటేశ్వర్లు, రంగస్థలి మాసపత్రిక సంపాదకుడు కె.ఎన్ రాజా, గట్టుపల్లి మురళీకృష్ణ, ఆలూరి శిరోమణిశర్మ, దుర్భా మురళీకృష్ణ, జిఎన్ కోటేశ్వరరావు, జి.జగదీశ్వరరావు, కవులు, కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.





## గూడూరు డివిజన్ వార్తలు

# ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో 63వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహిస్తున్న బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిసాయి. మూడురోజులుగా ఇక్కడ నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. గూడూరు పురపాలక సంఘ ఛైర్మెన్ పొనకా దేవసేన పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరు చదువుకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో, అంతే ప్రాధాన్యత క్రీడలకు ఇస్తే మంచి ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు. డిప్యూటి డిఇవో ఖాజా రహంతుల్లా, జడ్పీటీసీ సభ్యురాలు బొమ్మిరెడ్డి పద్మ, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి తదితరులు మాట్లాడారు. చిన్నతనం నుంచి క్రీడల పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపితే శారీరక మానసిక ఉల్లాసంతో పాటు చదువులో బాగా రాణిస్తారని చెప్పారు. బాలుర విభాగంలో విజేతలు అండర్-14లో విశాఖపట్నం, రన్నర్స్‌గా కర్నూలు, తృతీయ స్థానంలో ప్రకాశం నిలిచింది. అండర్-17లో విన్నర్స్‌గా తూర్పుగోదావరి, రన్నర్‌గా విశాఖపట్నం, తృతీయ స్థానంలో ప్రకాశం నిలిచింది. బాలికల విభాగంలో అండర్-14లో విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్స్‌గా తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా నిలిచింది. అండర్-17లో విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా గుంటూరు, తృతీయ స్థానంలో నెల్లూరు నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల కార్యదర్శి కోటేశ్వరమ్మ, మనోజ్, ఆర్గనైజింగ్ సెక్రటరి కిషోర్‌కుమార్, కడివేటి చంద్రశేఖర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు బాలరాజు, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సురేష్, భాను, 13జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



గూడూరు రైల్వేస్టేషన్‌లో ఇటీవల రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్‌ను కలసి గూడూరు రైల్వేస్టేషన్ సమస్యలను గురించి వినతిపత్రం ఇస్తున్న శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్

# కార్మికుల భద్రతే మా ధ్యేయం!

## - కార్మికశాఖ నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ గణేష్






గూడూరులోని షాదిమంజిల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ గణేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికుల భద్రతే తమ ధ్యేయమన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. గూడూరు డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పుట్టా శంకరయ్య ఆధ్వర్యంలో 5 మందికి ఘనంగా సన్మానించారు. వారిలో తాపీ మేస్త్రి బలరామయ్య, ఎలక్ట్రికల్ మేస్త్రీ వేణు, కార్పెంటర్ మేస్త్రీ బాషా, పెయింటింగ్ మేస్త్రీ కాశి, రాడ్ బెండింగ్ సెట్రింగ్ మేస్త్రీ చంద్ర ఉన్నారు. ఈ సందర్భంగా పుట్టా శంకరయ్య మాట్లాడుతూ నెల్లూరుజిల్లా భవన నిర్మాణ కార్మికసంఘం సిఐటియు యూనియన్ స్థాపించి 20సంవత్సరాలు నిండి 21వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని తెలిపారు. ఎక్కడెక్కడో వున్న భవన నిర్మాణ కార్మికులందరిని ఒక్క త్రాటిపైకి తీసుకువచ్చి వారందరికి ఒక యూనియన్ స్థాపించి, వారిని హెల్పర్‌బోర్డులో చేర్పించామన్నారు. హెల్పర్‌బోర్డులో చేరిన వాళ్ళకు మహిళల కాన్పుకు 20వేల రూపాయలు, పెళ్లిళ్ళకు 10వేలు, పనిలో గాయపడిన ప్రతి కార్మికునికి సహాయం అందిస్తున్నామన్నారు. పనిచేస్తూ మరణిస్తే 5లక్షలు ప్రభుత్వ హెల్పర్ బోర్డు అందజేస్తుందన్నారు. దీనిని గమనించి ప్రతిఒక్క కార్మికుడు హెల్పర్ బోర్డులో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కమిటి గౌరవాధ్యక్షులు వి.వి. రమణయ్య, కార్యదర్శి బండి కృష్ణయ్య, సహాయకార్యదర్శి పర్వతాల శివయ్య, ట్రెజరర్ రఫీ, సభ్యులు సుధాకర్, సూర్య, లక్ష్మయ్య, రమేష్ తది తరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా దసరా ఉత్సవాలు





గూడూరు పట్టణంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ దేవస్థానాలలో వివిధ అలంకారాలతో అమ్మవారు దర్శనమిస్తున్నారు. పట్టణంలోని ధర్మరాజు స్వామి దేవస్థానంలో ద్రౌపదీ స్వరూపిణీ, మహాదుర్గాదేవి, రక్తబీజ వధ అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విజయలక్ష్మి అమ్మవారుగా దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, గంగమ్మ దేవస్థానం, నారాయణమ్మ అమ్మవారి దేవస్థానం, నలజాలమ్మ దేవస్థానం, రెండో పట్టణంలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానాలలో వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో విశేషపూజలను చేపట్టారు. పలు దేవాలయాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. వృత్తి జీవనము కలవారికి సంతృప్తికరంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు ఆలస్యం కావచ్చు. బంధువర్గంతో సమస్యలు రాకుండా చూచుకొనాలి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలపై ఆశ వదలవలసి ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపార వ్యవహారాలు చురుకుగా సాగి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు, అవకాశాలుండగలవు. చేపట్టిన పనిని అనుకూలంగా సాధించుకొంటారు. సభలు, సమావేశాలలో ప్రముఖంగా ఉంటారు. ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వం నుండి ఋణాలు అందుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. కొత్తగా కొనుగోళ్ళు జరుగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల వృద్ధికి గాను, వ్యాపారవృద్ధికి గాను ప్రయత్నాలు బాగుంటాయి. బంధుమిత్రులతో సమస్యలు సర్దుబాటు కాగలవు. వృత్తి రంగాలలో వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు కేసులందు అనుకూలత లభించవచ్చును. ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. కొత్త ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్ధులుగా అధికారుల ఆదరణ పొందుతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. బంధుమిత్రులను కలుసుకొంటారు. కొత్త వ్యాపారాలు, అదనపు పెట్టుబడులు జరుపుతారు. అగ్రిమెంట్లు స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్ధికాభివృద్ధికి స్థిర నిర్ణయాలు తీసుకొనడం, కొత్త పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది. స్థిరాస్తుల కొనుగోలు, చెల్లించవలసిన బాకీలు తీర్చడం జరుగుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతల భారం ఉంటుంది. ప్రభుత్వ పరంగా గాని, యాజమాన్యాల నిర్ణయాల వల్ల మేలు జరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలందు అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే అనుకోని అదనపు ఖర్చులుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులు, అవసరాలకు ఇతరులకు సహాయం చేయడం జరుగుతుంది. పెద్ద మొత్తంలో పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. బంధుమిత్రులతో అభిప్రాయ భేదాలుంటాయి. శుభవార్త వింటారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 29.9.2017 నుండి**
**తేది. 5.10.2017 వరకు**

ఈ వారము ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, సింహంలో శుక్రకుజులు, కన్యలో రవి బుధులు, తులలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 29 శుక్రవారము మహర్నవమి. తేది 30 శనివారము విజయదశమి, తేది 2 సోమవారము గాంధీ జయంతి.

**ముహూర్తములు**

తేది 1 ఆదివారం ఉదయం 7.0 నుండి 9.0 లోగా వివాహ వ్యాపార అక్షరాభ్యాసం.
తేది 4 బుధవారం రాత్రి 10.15 నుండి 12.20 లోగా వివాహ, గృహప్రవేశములు.

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | నవమి | రా॥ గం.9.0వ॥ |
| తేది. 30 | శని | దశమి | రా॥ గం.10.38వ॥ |
| తేది. 1 | ఆది | ఏకాదశి | రా॥ గం.11.23వ॥ |
| తేది. 2 | సోమ | ద్వాదశి | రా॥ గం.12.41వ॥ |
| తేది. 3 | మంగళ | త్రయోదశి | రా॥ గం.12.57వ॥ |
| తేది. 4 | బుధ | చతుర్దశి | రా॥ గం.12.42వ॥ |
| తేది. 5 | గురు | పూర్ణిమ | రా॥ గం.12.0వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్ధికముగా ఇబ్బందులుండినా, వృత్తి వ్యాపార వర్గాలు ఆదాయం పెంపొందించుకునే కృషి చేస్తారు. అనవసర ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. కొత్త పరిచయాలు కలుగుతాయి. కుటుంబంలో స్వల్ప అపోహలు, సమస్యలు తొలగిపోతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపార రంగాలలో, పెట్టుబడి రంగాలలో అవకాశాలు లభించగలవు. సొంత పనులు టెన్షన్‌తో జరుగుతాయి. పలుకుబడికి మొగమాటాలకు గాని ఖర్చు పెడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. దైవ కార్యాలందు సమావేశాలందు పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో అపోహలు, సమస్యలుండినా సర్దుకొంటాయి. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడతారు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. కుటుంబ ఖర్చులు తప్పని సరిగా పెరుగుతాయి. ఆరోగ్యం ఫరవాలేదు. కొత్త వ్యాపారాలు నిర్ణయం కావడం, పెట్టుబడి రంగాలలో అవకాశాలు దొరకడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబంలో అపోహలు మనస్పర్ధలు రాకుండా చూచుకొనాలి. వాహనాలు నడిపేటప్పుడు, కరెంటు, యంత్రాల పనులందు జాగ్రత్తగా ఉండాలి. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుని ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు విజయవంతంగా జరుపుతారు. దైవ సేవ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్వల్పంగా ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, ఆదాయం ఉంటుంది. బంధువర్గంతో విభేదాలు కలుగవచ్చును. ఉద్యోగులపైన, వ్యాపారులపైన అధికారుల వత్తిడులు, దాడులు ఉంటాయి. పనులను ఎంత సమర్ధవంతంగా చేస్తున్నా, అధికారులకు తృప్తి ఉండదు. తొందరపడి హామీలివ్వడం చేయవద్దు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా అభివృద్ధి జరిగేందుకు మీరు చేసే కృషికి పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లకు, వైద్యానికి ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగులకు అధికారుల ప్రోత్సాహం బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. బిడ్డలకు శుభకార్యాలు, ఉద్యోగావకాశాలు ఫలించ గలవు. ఉద్యోగార్ధులకు అవకాశాలుంటాయి.

# అమరావతిలో మహిష్మతి

శ్రీను గల్పిక

అది గన్నవరం ఎయిర్‌పోర్టు. హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతిలో పూలబొకేతో లాంజ్‌లో వున్నాడు. ఆయనతో పాటు కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి, రాష్ట్రమంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, నారా లోకేష్, పత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావులు ఉన్నారు. ఎయిర్‌పోర్టుకు రమ్మని చంద్రబాబే స్వయంగా ఫోన్ చేసి చెప్పడంతో అందరూ వచ్చారు. ఎవరికీ సబ్జెక్ట్ తెలియదు. చంద్రబాబే పూలబొకేతో ఎదురుచూస్తున్నాడంటే ఏ డోనాల్డ్ ట్రంప్‌నో, బిల్‌గేట్స్ వస్తుంటాడని అనుకున్నారు. అంతలో గన్నవరం ఎయిర్‌పోర్టులో ఓ స్పెషల్ ఫ్లైట్ ల్యాండయ్యింది. చంద్రబాబు అలర్టయ్యాడు. ఆయనను చూసి మిగతావాళ్ళు కూడా టెన్షన్‌తోనే అటెన్షన్‌లో నిలబడ్డారు. ఫ్లైట్‌లో నుండి దర్శకుడు రాజమౌళి దిగాడు. మంత్రులందరూ వెనుక ఇంకెవరన్నా వరల్డ్ ఫేమస్ విఐపి వస్తున్నాడేమోననుకుని చూస్తుంటే చంద్రబాబు మాత్రం రాజమౌళికి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికాడు. రాజమౌళి కోసమేనా ఇంత బిల్డప్ ఇచ్చింది అని అందరూ నీరుగారిపోయారు. రాజమౌళిని తీసుకుని అందరూ ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ రాజధానిపై చర్చ మొదలైంది. నన్ను పిలిపించిన కారణమేంటో చెప్పండని రాజమౌళి అడిగాడు. అమరావతి రాజధానిని అద్భుతంగా కట్టాలని చెప్పి నేను ప్రపంచంలో వున్న అన్ని దేశాలూ తిరిగాను. అఖరకు ఉగాండా, రుమాండాలకు కూడా వెళ్లాను, కానీ అవేవీ నా దృష్టిని ఆకర్షించలేదు. కాని, బాహుబలి సినిమాలోని మహిష్మతి సామ్రాజ్యం కోటలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమరావతిలోనూ నాకు అలాంటి కోటలే కావాలి. ఇందుకు నీ సహకారం కావాలని చంద్రబాబు అడిగాడు. దానికి రాజమౌళి... సార్, బాహుబలి సినిమాలో చూపించినవి ఒరిజనల్ కోటలు కావు, అవన్నీ సెట్టింగ్స్... టెంపరవరీగా వుంటాయంతే అని చెప్పాడు. అప్పుడు ముదురుదోమల శాఖ మంత్రి నారాయణ జోక్యం చేసుకుని... మాకు కావాల్సింది కూడా సెట్టింగ్సే... ఒరిజినల్ కోటలు కాదు... లేకుంటే ఈ ఒకటిన్నర ఏడాదిలో కాంక్రీట్ భవనాలను కట్టగలమా ఏంటి? ఈ మూడున్నరేళ్లలో కట్టని కోటను ఇంకో ఒకటిన్నరేడాదిలో ఎలా కట్టగలం... సెట్టింగ్స్ అయితేనే తొందరగా పనైపోతుంది. అమరావతిలో మహిష్మతి లాంటి రాజధానిని నిర్మించామని ప్రజలకు చూపించగలం. కాబట్టి అమరావతిలో మీరు మాకు ఆ సెట్టింగ్స్ వేసిస్తే చాలు అని ప్రాధేయపడ్డాడు. ఆ సమయంలోనే నారా లోకేష్ సబ్జెక్ట్‌లోకి ఎంటరయ్యాడు. తన తెలివితేటలనన్నింటిని ఇక్కడ వాడాలనుకున్నాడు. తన తెలివికి సినీ పరిజ్ఞానాన్ని కూడా జోడించాడు. రాజమౌళితో డిజైన్ చెప్పసాగాడు. అమరావతిలో పెద్దపెద్ద కోటలు సెట్టింగ్స్ వేయాలి, అమరావతి రాజ్యంలోకి కార్లు, ఇతర వాహనాలకు ప్రవేశం ఉండదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గుర్రాల మీద రావాలి. మంత్రులకు మాత్రం గుర్రపు రథాలు ఏర్పాటు చేస్తాం. ముఖ్యమంత్రికి గుర్రపు రథంతోనే కాన్వాయ్ ఉంటుంది. ముఖ్యమంత్రి ప్రయాణించే రథం మాత్రం బాహుబలి సినిమాలో బల్లాలదేవుడు ఉపయోగించే రథం మాదిరిగా ఉండాలి. మంత్రులకు, ఎమ్మెల్యేలకు గన్‌మెన్‌ల స్థానంలో అంగరక్షకులుంటారు. వారి చేతుల్లో తుపాకులు బదులు కత్తులు, విల్లంబులు, గదలు వుంటాయి. అమరావతిలో అశ్వదళాన్ని, గజ దళాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని చెప్పుకుపోసాగాడు. అప్పుడు చంద్రబాబు జోక్యం చేసుకుని... చూడబోతే నువ్వు నా చేత బల్లాలదేవుడు గెటప్ వేయించేటట్లున్నావ్, రాజమౌళిని పిలిపించింది ఓన్లీ డిజైన్‌ల కోసమే... అంతే గాని మనం వేషాలు మార్చుకుని తిరగడానికి కాదు అని అన్నాడు. అప్పుడు లోకేష్... మీరు అంటుంటే నాకో ఐడియా వచ్చింది నాన్న గారు... ఎలాగూ అమరావతిలో మహిష్మతి సెట్టింగ్ వేస్తాం కదా... ఇక్కడే సినిమాలు కూడా తీసుకోవచ్చని చెపితే... ఇటు రాజధానిగా ఉపయోగపడుతుంది, అటు షూటింగ్‌లకు రెంటుకిచ్చి డబ్బులు సంపాదించుకోవచ్చు అని చెప్పాడు. అది విన్న మంత్రులు... బాబు ఐడియా భలే వుంది సార్ అని చంద్రబాబుతో అన్నారు. సరేలే ఆలోచిద్దాం అని చెప్పి చంద్రబాబు రాజమౌళిని యాంటీ రూమ్‌లోకి తీసుకెళ్లాడు. పది నిముషాలు రహస్యంగా మాట్లాడి బయటకు తీసుకొచ్చాడు. తర్వాత రాజమౌళిని సాగనంపి రండని మంత్రులను ఎయిర్‌పోర్టుకు పంపించాడు.

అందరూ వెళ్ళాక చంద్రబాబు, నారాయణలు మిగిలారు. నారాయణ వుండి... సార్, రాజధాని డిజైన్‌ల కోసమే రాజమౌళిని పిలిపించారా? మన రాష్ట్రంలో ఎంతో మంది ఆర్కిటెక్ట్స్ వుండగా అతనిని ప్రత్యేకంగా పిలవడం ఎందుకని అడిగాడు. దానికి చంద్రబాబు... రాజమౌళి ఒక సినిమా తీయాలంటేనే మూడేళ్ళు పడుతుంటుంది... అలాంటిది అతని డైరక్షన్‌లో ఒక రాజధాని కట్టాలంటే మూడేళ్ళు పట్టదా? మనం ఎలాగూ ఎన్నికల లోపు రాజధానిని కట్టలేం... కనీసం రాజధాని నిర్మాణాన్ని రాజమౌళికి అప్పగించామంటే... ఇదెలాగూ బాహుబలిలాగా మూడేళ్ళ ప్రాజెక్ట్‌లే అనుకుని జనం సర్దుకుపోతారు... రాజధాని విషయంలో మనపై వ్యతిరేకత రాదు అని చెప్పాడు. నీ వాడకానికి ఆఖరకు రాజమౌళి కూడా బలయ్యాడా? అని నారాయణ మనసులో అనుకుంటూ అక్కడ నుండి లేచాడు.

# రంగన్నదే 'విజయ'ం



నెల్లూరులోని విజయ డెయిరీ పాలకవర్గంలో ముగ్గురు డైరెక్టర్ల ఎంపికకు జరిగిన ఎన్నికల్లో ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బలపరచిన ముగ్గురు అభ్యర్థులు సూరా ప్రభాకర్‌రెడ్డి, కలికి వేణుగోపాల్‌రెడ్డి, చెన్నూరు వెంకటకృష్ణారెడ్డిలు విజయం సాధించారు. దీంతో విజయ డెయిరీపై కొండ్రెడ్డి రంగారెడ్డి తన ఆధిపత్యాన్ని మరోసారి ఋజువు చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం తెలుగుదేశం కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

# క్విల్లింగ్ పేపర్స్‌తో.. అందమైన బొమ్మలకొలువు

## - శారదామణి అత్యద్భుత కళాప్రతిభ





దసరా వేడుకలు వస్తే చాలు..ఎంతో ఆహ్లాదమైన రీతిలో ఈ పండుగను నిర్వహించుకుంటూ ఉంటాం. ఈ ఉత్సవాల రోజుల్లో మహిళలు అనేకమంది తమ ఇళ్ళలో బొమ్మలకొలువులు కూడా తీర్చిదిద్ది, చుట్టుపక్కల ఉన్నవారినంతా ఆహ్వానించి అమ్మవారికి పూజలు చేసి వేడుక చేయడం ఎంతోకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. అయితే, నెల్లూరుకు చెందిన ప్రముఖ కళాకారిణి పాబోలు శారదామణి తన కళాప్రతిభతో కేవలం కాగితాలు (క్విల్లింగ్ పేపర్స్)తోనే అత్యద్భుతమైన రీతిలో బొమ్మల కొలువు తీర్చిదిద్ది అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. దసరా పర్వదినాల్లో ఇంటింటా ఎంతో వేడుకగా ఉండే బొమ్మలకొలువుల సంప్రదాయం రానురాను కనుమరుగవుతున్న నేటి ఆధునిక కాలంలో, ఆ సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ ఆమె ఎలాంటి పరికరం సాయం లేకుండా క్విల్లింగ్‌పేపర్స్‌తోనే అందమైన దేవతా రూపాలను అత్యద్భుతంగా రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నారు. నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని రాంజీనగర్ మొదటివీధిలో ఉన్న ఆమె నివాసం ఈ అందమైన బొమ్మలకొలువును చూసేందుకు తరలివచ్చిన చుట్టుపక్కల ప్రజలతో ఎంతో సందడిగా మారింది. కాగా, క్విల్లింగ్ పేపర్స్‌తోనే అద్భుత కళాఖండాలు రూపొందించి శారదామణి గతంలో పలు అంతర్జాతీయస్థాయి అవార్డులు అందుకోవడం విశేషం. ప్రత్యేకించి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, రికార్డ్ హోల్డర్స్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డన్‌స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్స్..ఇలా ఆరు అంతర్జాతీయస్థాయి అవార్డులను కూడా ఆమె అందుకుని ఉన్నారు. క్విల్లింగ్ పేపర్స్‌తో వెయ్యి బొమ్మలను మరింత కళాత్మకంగా రూపొందించి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను కూడా సాధించాలని ఆమె విశేష కృషి చేస్తున్నారు కూడా.



## శ్రీకాళహస్తి న్యూస్

# శ్రీకాళహస్తీశ్వరాలయానికి పాత్రల వితరణ

## 7 లక్షల విలువచేసే సామగ్రినందించిన నెల్లూరీయులు



నెల్లూరులోని మురళీకృష్ణ హోటల్ అధినేత సుబ్బారావు దంపతులు ఈ నెల 23న శ్రీకాళహస్తీశ్వరాలయంలో లడ్లు తయారుచేసే లడ్డుపోటుకు అవసరమైన సామగ్రిని అందజేశారు. 3 పిండి మిషన్లు, లడ్లు తయారుచేసే అండాలు, పాత్రలు వగైరాలన్నీ కలిపి 7లక్షల రూపాయలు విలువచేసే సామగ్రిని ఆలయ ఇ.ఓ డి.భ్రమరాంబకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు దంపతులను శ్రీకాళహస్తీశ్వరాలయంవారు సాదరంగా ఆహ్వానించి వారికి దైవదర్శనం చేయించారు. అనంతరం ఆలయ ఇ.ఓ వారిని ఘనంగా సన్మానించి ఆలయ వేదపండితుల ద్వారా ఆశీస్సులను అందజేశారు.

## 'నవరత్నాల'కు ప్రజల స్పందన

డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలకు ప్రజల స్పందన ఎంతో బావుందని, ఆ పథకాలను అందరూ కోరుకుంటున్నారని వైఎస్సార్సీపి జిల్లా అధికారప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలోని పలు వార్డుల్లో ఆయన పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజన్నపాలన జగనన్నకే సాధ్యమని అన్నారు. డా. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యేందుకు అందరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గిరిప్రసాద్‌గౌడ్, మురళి మందన్, ధన, కల్యాణ్, శశి, తీగల చిన్నా, లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 'పీకే'సే పనికేనా?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వేదికలెక్కించడం. అతని సలహాలు, సూచనలు, వ్యూహాలు తెరవెనుకకు మాత్రమే పరిమితం కావాలి. అంతేగాని, అతని పనితనం లైవ్‌షో కాకూడదు.

ప్రశాంత్‌కిషోర్ మూలంగా ఈసారి ఎన్నికలకు పార్టీకైతే ఒక ఉపయోగముంది. 2014 ఎన్నికల్లో వైకాపా పరాభవానికి ప్రధానకారణాలలో ఒకటి అభ్యర్థుల ఎంపిక. మాట తప్పను, మడమ తిప్పను అంటూ జగన్ అప్పట్లో పార్టీలోకి వచ్చిన ద్వితీయశ్రేణి నాయకులందరికీ టిక్కెట్లు ఇచ్చాడు. ఆయా నియోజకవర్గాల్లో సొంతంగా బలముండి, టిక్కెట్లిస్తే పార్టీలోకి వస్తామన్న నాయకులను జగన్ పార్టీలోకి తీసుకోలేదు. ఇలాంటి వాళ్ళంతా తెలుగుదేశంలో చేరిపోయారు. నియోజకవర్గాలలో సత్తావున్న నాయకులు టీడీపీ టిక్కెట్లు తెచ్చుకుని గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసిపి నుండి 70మంది గెలిస్తే వారిలో ఎక్కువమంది గెలుపుకు వై.యస్. సానుభూతే కారణం. అదే తెలుగుదేశం నుండి వందమంది గెలిస్తే... ఎక్కువ మంది గెలుపుకు వారి వ్యక్తిగత సామర్థ్యమే కారణం. రాబోయే ఎన్నికల్లో కూడా జగన్ గతంలోలాగే ఎవరికి పడితే వాళ్ళకు టిక్కెట్లిస్తే పరిస్థితిలో పెద్ద మార్పుండదు. ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీకి శాశ్వత ఓట్లుంటాయి. సొంతంగా ఓ పదివేల ఓట్లన్నా తెచ్చుకోగల నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలి. ఇలా చేయాలంటే 175 నియోజకవర్గాలలోనూ వడపోత మొదలుపెట్టాలి. ఇప్పుడున్న సిటింగ్ ఎమ్మెల్యేలలోనూ కొందరిపై వ్యతిరేకత వుంది. అలాంటి వారిని పక్కనపెట్టాలి. ఆయా నియోజకవర్గాలకు ఏ నాయకుడైతే కరెక్టో చూడాలి. అలాగే 2014 ఎన్నికల్లో ఓడిపోయిన నియోజకవర్గాలు వందకుపైనే వున్నాయి. అక్కడ అధికారపార్టీ ఎమ్మెల్యేల మీద అంతో ఇంతో వ్యతిరేకత వుంటుంది. అక్కడ వైకాపా టిక్కెట్లను ఆశిస్తున్న అభ్యర్థుల శక్తిసామర్థ్యాలను అంచనా వేయాలి. కరెక్ట్‌గా ప్రతి నియోజకవర్గానికి గెలుపు గుర్రాలనే ఎంపిక చేయాలి. ఇక్కడ మొహమాటానికి తావులేదు. ఆయన మనల్ని నమ్ముకుని ముందే పార్టీలోకి వచ్చాడు... ఈయనకు మనం సీటివ్వకపోతే ఇంకెవరిస్తారనే ఆలోచనలకు తావుండకూడదు. గత ఎన్నికల్లో ఇలాంటి ఆలోచనలు పెట్టుకోబట్టే గెలవాల్సిన సీట్లను కూడా ఓడిపోవాల్సి వచ్చింది. ఎన్నికలంటేనే యుద్ధం. ఇక్కడ గెలవడమే ముఖ్యం. మొహమాటాలకు పోతే అసలుకే ఎసరొస్తుంది. ఇలాంటి మొహమాటాలకు పోతాననే జగన్ ఈసారి అభ్యర్థుల ఎంపిక బాధ్యతను పూర్తిగా ప్రశాంత్‌కిషోర్‌కు అప్పగించినట్లున్నాడు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రశాంత్‌కిషోర్ బృందం అభ్యర్థుల ఎంపికపై సర్వే నిర్వహిస్తోంది. ఎన్నికల్లో గెలవలేడు అని రిపోర్ట్ వచ్చినవాళ్ళను, జగన్‌కు ఎంత ముఖ్యమైనా సరే ఈసారి మాత్రం పీకి పక్కనపెట్టడానికే నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# 'మెగా' చూపు... ఎవరి వైపు

(మొదటి పేజీ తరువాయి)

అలాగని సొంతంగా పార్టీని నడపలేడు. తన తమ్ముడు పవన్‌కళ్యాణ్ పెట్టిన 'జనసేన'లోకి పోలేడు. తెలుగుదేశంలో చూస్తే నందమూరి కుటుంబం ఆధిపత్యం. రాష్ట్రంలో ఎన్టీఆర్ తర్వాత అభిమానులలో ఆ స్థాయి ఇమేజ్ తెచ్చుకున్న నటుడు చిరంజీవి. తెలుగుదేశంలోకి వెళితే నందమూరి ఆధిపత్యం క్రింద పనిచేసినట్లే అవుతుంది. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఆయన ముందున్న మార్గాలు బీజేపీలో చేరడమా? లేక వైకాపాలో చేరి పార్టీకి పెద్దమనిషిగా మార్గదర్శకత్వం వహించడమా? బీజేపీలో చేరితే రాష్ట్రంలో ఆ పార్టీకి చిరంజీవే ప్రధాన నాయకుడవుతాడు. తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే బీజేపీలో చేరే ప్రతిపాదన కూడా చిరంజీవి వైపు నుండి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే రేపటి ఎన్నికలలో అయితే రాష్ట్రంలో బీజేపీకి ఎలాంటి అవకాశాలు లేవు. ఈ దశలో ఆలోచిస్తే ఆయన కూడా బీజేపీ వైపు చూడకపోవచ్చు. చిరంజీవికి జగన్ పట్ల మాత్రం సానుకూల అభిప్రాయం వున్నట్లు తెలుస్తోంది. జగన్ వ్యవహారశైలిని, మాట మీద నిలబడే తత్వాన్ని చిరంజీవి పలువురి వద్ద ప్రస్తావించి ప్రశంసించినట్లు సమాచారం. చంద్రబాబు కంటే కూడా జగన్ అధికారంలోకి వస్తేనే మంచిదని చిరంజీవి అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎలాగూ కాంగ్రెస్ వుండదు. కాబట్టి చిరంజీవి సహకారం పరోక్షంగానైనా, ప్రత్యక్షంగా నైనా జగన్‌కే వుండొచ్చని రాజకీయ వర్గాల భోగట్టా!

## కాలధర్మం

### జెట్టి కృష్ణారెడ్డి



ప్రముఖ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, నెల్లూరులోని కింగ్స్ కోర్టు వాసి జెట్టి కృష్ణారెడ్డి సెప్టెంబర్ 17వ తేదీన తన 82వ ఏట కనుమూసారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు జెట్టి మదన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో ప్రముఖ కాంట్రాక్టర్‌గా అందరికీ సుపరిచితుడే! కోవూరు స్వగ్రామం అయినప్పటికీ వారు తర్వాత కాలంలో నెల్లూరులో స్థిరపడ్డారు. విద్యార్థి దశలోనే బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో ఆరితేరిన కృష్ణారెడ్డి రాష్ట్రస్థాయి ఆటగాడిగా ఎన్నో టోర్నమెంట్స్ ఆడి రాణించారు. ఏపి బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా కూడా పని చేసారు. స్వగ్రామమైన కోవూరులో సుందర్‌మహల్‌ను స్థాపించి వినోదరంగంలోకి అడుగుపెట్టారు. నెల్లూరుజిల్లా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా, జిల్లా సినిమా థియేటర్స్ యజమానుల సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి ప్రైవేట్ బస్సులను రద్దు చేయకముందు ప్రైవేట్ బస్సుల యజమానుల సంఘం అధ్యక్షులుగా పని చేసారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, జెట్టి మదన్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### దరిశి ప్రసాదరావు(పంతులు)



ప్రముఖ నటుడు, పద్యరచయిత దరిశి ప్రసాదరావు (పంతులు) ఈనెల 13వతేదీన అనారోగ్యంతో స్వర్గస్థులైనారు. ఆయన వయసు 70 సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు. ప్రసాదరావుగా కంటే పంతులుగా ఆయన నెల్లూరీయులుకు సుపరిచితులు. ప్రకాశం జిల్లా ఇసుకదరిశి ఆయన స్వగ్రామం అయినప్పటికీ ఆయనలోని కళాతృష్ణ, పద్యనాటక రంగంపై వున్న మక్కువ, నటన పట్ల వున్న ఆసక్తి ఆయనను అందరివాడిగా, నెల్లూరీయుల మనిషిగా మలిచింది. ప్రముఖదాత, పారిశ్రామికవేత్త జె.ఎస్.రెడ్డికి ఆయన ఎంతో ఆప్తుడు. నెల్లూరు టౌన్‌హాలు వేదికగా కొన్నేళ్ళ పాటు నిర్వహించిన జక్కా రంగారెడ్డి స్మారక పద్యనాటక పోటీల పర్యవేక్షణ భారం అంతా కూడా పంతులే చూసుకునేవారు. ఎన్నో పద్యాలు వ్రాయడమేకాక, పద్యనాటకాలలో తన కిష్టమైన పాత్రలు పోషించారాయన. పద్యనాటకాలలో కృష్ణుడి పాత్రను ఆయన అమితంగా ఇష్టపడేవారు. ఆ పాత్రలో ఆయన బాగా రాణించేవారు. పంతులుకు సినీరంగంలోనూ ప్రవేశముంది. తెలుగులో రెండు సినిమాలతో పాటు కన్నడలో రెండు సినిమాలలో నటించారు. ఆయన అకాల మరణంతో నెల్లూరు కళారంగం ఒక ముద్దుబిడ్డను కోల్పోయినట్లయ్యింది. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జూనియర్

(మొదటి పేజీ తరువాయి)

జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం చేసాడు. 2014 ఎన్నికలప్పుడు మాత్రం చంద్రబాబు అతనిని ప్రచారానికి పిలవలేదు. ఎందుకంటే ఎన్టీఆర్ ప్రచారానికి వచ్చినా రాకున్నా ఎన్టీఆర్ అభిమానుల ఓట్లు పడేది తెలుగుదేశానికే! పక్కకు పోవు. అదే పవన్ కళ్యాణ్ ప్రచారానికి వస్తే పక్కకుపోయే ఓట్లు కూడా తెలుగుదేశానికి వస్తాయి. ఈ లెక్కలోనే గత ఎన్నికల్లో జూనియర్‌ను దూరంగా పెట్టి పవన్‌ను తెచ్చుకున్నాడు.

మళ్ళీ ఎన్నికలొస్తున్నాయి. ఈసారి పవన్ తెలుగుదేశంకు మద్దతిచ్చేది అనుమానమే. సొంతంగా పోటీ చేసే ఆలోచనలో ఆయనున్నాడు. చంద్రబాబుకు కావాల్సింది కూడా అదే! అదే సమయంలో తాను దూరంగా పెట్టిన జూనియర్ ఎన్టీఆర్‌ను ఇంకా దూరంగా పెడితే లేనిపోని సమస్యలొస్తాయి. జూనియర్‌ను చంద్రబాబు మరీ తొక్కేస్తున్నాడన్న ప్రచారం ఎక్కువైతే అతని అభిమానులు రివర్సయ్యే అవకాశముంది. 2014 ఎన్నికలప్పుడు కొడాలి నాని ఈ బాపతే! కాబట్టే మళ్ళీ జూనియర్‌ను వాడుకునే ఆలోచనకు చంద్రబాబు శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తోంది. నందమూరి కుటుంబంలో ప్రధాన ఆకర్షణ, బలమైన అభిమానగణం వుండేది జూనియర్‌కే! జూనియర్‌ను తిరిగి పార్టీ కోసం వాడుకోవాలంటే అతని తండ్రి నందమూరి హరికృష్ణను లైన్‌లోకి తీసుకోవాలి. ఈ కోణంలోనే హరికృష్ణకు పార్టీలో మళ్ళీ పెద్దపీట వేస్తున్నాడు. ఈ విధంగా జూనియర్ ఎన్టీఆర్ వాడకానికి మార్గం సుగమం చేసుకున్నాడు.

# ఆర్య వైశ్యులారా ఆలోచించండి

అయ్యవారికి చాలు ఐదు వరహాలు ..పిల్లలకు చాలు పప్పు బెల్లాలు అనే నానుడి ప్రకారం అయ్యవారు.. అనగా పంతులు గారు లేదా మాస్టారు చాలా సింపుల్ మనిషని, నిరాడంబరుడని స్ఫురిస్తుంది.

ప్రొఫెసర్ అని ఖచ్చితంగా పలకలేని వారు పప్ సార్.. (పప్పు..చారు) అనేస్తూ ఉంటారు. ఈ పదం కూడా అయ్యవారు నిరాడంబరుడు, సింపుల్.. ఎక్కడో విశ్వవిద్యాలయంలో ఒక మూలన ఉండి పాఠాలు చెప్పుకుంటారు అనే భావన కలిగిస్తుంది.

ఇక విషయానికొస్తే .. ఐలయ్య అనే పంతులుగారొకరున్నారని, ఆయన ప్రొఫెసర్ అని, కొంత మందికి మాత్రమే తెలుసు. ఆయన పెద్ద పాపులర్ కాదు. ఆయనొక పుస్తకం రాసాడని, దానికి నచ్చని పేరు పెట్టాడని, ఎవరికీ తెలియదు.. ఆర్య వైశ్యులు రోడ్లపైకెక్కి గొడవ చేసేంతవరకూ....మూడడుగుల మనిషిని ఆర్యవైశ్యులే ముప్పై అడుగుల మనిషిని చేసేసారు... ఎక్కడో యూనివర్సిటీలో పాఠాలు చెప్పుకొనే ఆయనను పాపులర్ చేసేసారు. అదీ ఆర్యవైశ్యుల కష్టార్జితంతో.. ఎవరికీ తెలియని మనిషిని వీరే ప్రపంచ ప్రఖ్యాత మనిషిగా తయారుచేస్తున్నారు.. రేపొద్దున అయ్యవారికి ఎమ్మెల్యే, ఎంపీ అవకాశం కల్పించేలా ఉన్నారు... వారి సొంత ఖర్చుతో..

పుస్తకము రాసాడా.. రాసుకోనివ్వండి.. నచ్చని పేరు పెట్టాడా.. పెట్టుకోనివ్వండి.. అసలు ఈయన ఎవరికి తెలుసు? ఎంతమందికి తెలుసు? ఈయన ఏదో అన్నాడని బాధపడనవసరం లేదు.. కొంపలేమీ మునగలేదు.. ఆకాశం ఊడి కింద పడదు. టైటిల్ విషయానికొస్తే కొత్తగా ఎవరూ ఎవర్నీ తిట్టనవసరము లేదు. పేరు పెట్టనవసరమూ లేదు. ప్రతి వర్గాన్ని ఉటంకిస్తూ వేలాది తెలుగు సామెతలున్నాయి. నిర్దాక్షిణ్యంగా ప్రతి కులాన్ని ఉచ్చ నీచ భేదాల్లేకుండా ఏకి పారవేసిన సామెతలు కోకొల్లలుగా ఉన్నాయి. సమాజాన్ని ఎండగట్టిన నాటకాలూ నాటికలూ అందరికీ తెలిసినవే, ఏ వర్గమూ స్పేర్ చేయబడలేదు ఫలానా వారు ఇలాగ ఫలానా వారు అలాగ అని ఆల్రడీ నాటుకుపోయి ఉన్న సమాజం మనది.

ఈ రోజుల్లో ఏ ఒక్కడికైనా చదివే ఇంట్రస్ట్, ఓపిక ఉందా?? అందులోనూ ఒకటా రెండా పదిహేను పేజీలు.. ఈ రోజుల్లో ఎవరికీ అంత తీరిక, ఓపిక లేదు..ఎందుకంటే మనమున్నది ఒక విచిత్రమైన కాలంలో.. ఫేస్ బుక్కు.. వాట్సప్పు.. పిల్లి పిల్ల బొమ్మ.. కుక్క పిల్ల బొమ్మ ..చెత్త బుట్ట ..మురికి నల్లా.. ఏదైనా ఎవరో ఒకరు పెట్టడమూ.. దానికి క్యూట్ అనీ ..గ్రేట్ అనీ వావ్ అనీ లైక్ లు కొట్టడము.. తప్ప చదివే ఓపిక ఎవ్వరికీ లేదు ..ఇదంతా ఇంటర్నెట్ గొడవైతే.. ముప్పై రూపాయలు పెట్టి పుస్తకాన్ని కొని చదివే వాడిని ఒక్కడిని చూపించండి???

ఆ పదిహేను పేజీలు కూడా గ్రాంథిక భాష ..చదివినా కూడా చచ్చినా ఒక్క ముక్క కూడా అర్థం కాదు.. ఆ పుస్తకాన్ని బ్యాన్ చెయ్యమని ప్రభుత్వాన్ని కోరడమూ.. ఒకవేళ ప్రభుత్వము దాన్ని బ్యాన్ చెయ్యడము జరిగితే ఫ్రీగా ఆ పుస్తకానికి పబ్లిసిటీ ఇచ్చినట్లే కదా?? సాల్మన్ రష్దీ గారు ఏదో రాసారంట.. చదివినది ఎవరు? ఎంత మంది చదివారు? ఎవరికి అర్థమయ్యింది?.. కార్ల్‌మార్క్స్ గారు క్యాపిటల్ రాసారంట.. యూనివర్సిటీ ప్రొఫెసర్లు కొంత మంది మాత్రమే చదివారు ..వాళ్ళు ఆహా ఏమి రాసాడండీ ..అని మెచ్చుకుంటారు..నక్సలైట్లపై దాడి చేసిన పోలీసులు వారు నక్సలైట్లే అని నిరూపించడానికి అక్కడ ఈ క్యాపిటల్ పుస్తకం ఉంది కాబట్టి వాళ్ళు నక్సలైట్లే అంటారు.. ఇంతకీ ఆ పుస్తకాన్ని చదివిన వాళ్ళు కొద్దిమంది మాత్రమే. అందుకనే రాసుకుంటే రాసుకోనివ్వండి.. అక్కడ చదివేవాళ్ళు ఎవరున్నారు గనుక?

ఆ పుస్తకానికి, లేదా వ్యాసానికి కౌంటర్‌గా ఇంకో పుస్తకము రాస్కోండి, దాన్నీ చదివే దిక్కులేదు... ఒకవేళ పంతులు గారు రాసిన పుస్తకాన్ని కొంతమంది చదివి, ఆర్య వైశ్యుల్ని అర్థం, లేక అపార్థం చేసుకున్నా... అయ్యో ఏదో గొప్ప అన్యాయం జరిగిపోతుంది అని భావించినా ,రాత్రికి రాత్రి వారు వైశ్యుల వ్యాపార వ్యవహారాలను స్వాధీనము చేసుకోగలరా? ఒక వేళ కొంత మంది ఆలోచనల్లో ప్రగాఢమైన మార్పు వచ్చి రాత్రికి రాత్రి గొప్ప వ్యాపారవేత్తలుగా మారగలరా? వ్యాపారం చెయ్యాలంటే కొద్దో గొప్పో సంపద కావాలి కదా? ఎంతమంది దగ్గర ఉన్నది సంపాదన? కొత్తగా ఆర్య వైశ్యులకు పోటీగా ఇప్పటికి ఇప్పుడు కొత్త వర్గం ఉద్భవించగలదా?

ఆర్య వైశ్యులారా కొద్దిగా ఆలోచించండి. ఐలయ్య గారికి పేరు ప్రఖ్యాతులు ఫ్రీగా సృష్టించి ఇవ్వకండి. ఇప్పటికే చాలా పెద్ద మనిషిని చేసేసారు ఆయనను. మీడియాకి కావలసింది సెన్సేషన్ .. మీడియాకి మీరు మేతవేసి మీ జేబులు ఖాళీ చేసుకోకండి. ఒక మనిషిని పట్టించుకోకపోతే చాలు కాలక్రమంలో కనుమరుగైపోతాడు.. ఇప్పటికైనా గ్రహించండి.

**కొసమెరుపు:** అసలు రోడ్లపైకి వచ్చి ఐలయ్య డౌన్‌డౌన్ అంటూ నినదించే వాళ్ళలో కనీసం పదిశాతంమందైనా ఈ పుస్తకాన్ని చదివుంటారా అన్నది నా ధర్మసందేహం.

**- కోరం కిషోర్, ఐ.ఆర్.ఎ.యస్.**

# నెల్లూరు కవులకు సన్మానాలు

గత నెల 20వ తేదిన కరీంనగర్‌లో జరిగిన ప్రపంచస్థాయి తెలుగు కవుల కవి సమ్మేళనంలో నెల్లూరు నుంచి 11 మంది కవులు పాల్గొన్నారు. ఆ కవులను నెల్లూరు నగరంలో మంగళవారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. నెల్లూరులోని టౌన్‌హాల్ ప్రాంగణంలోని సమావేశమందిరంలో తెలంగాణ రైతు హార్వెస్ట్ సంఘంవారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం నిర్వాహకుడు అనిల్‌కుమార్ ఈ సన్మాన కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విక్రమసింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ సి.వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కవులను సన్మానించి ప్రపంచ రికార్డ్స్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఆదిత్య, నెరసం అధ్యక్షులు ఏ.జయప్రకాష్, కవులు ములుగు విజయదుర్గ, మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వారసుడు... దూసుకెళ్తున్నాడు!

## తండ్రికి తగ్గ తనయుడిగా రాణిస్తున్న రాజగోపాల్‌రెడ్డి



ఏ పదవీ లేనప్పుడే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బిజీగా వుండేవాడు. అల్లీపురంలోని ఆయన ఇల్లు గాని, ఆదిత్యనగర్‌లోని క్యాంప్ ఆఫీసు గాని సందర్శకులతో కిటకిటలాడుతుండేది. సోమిరెడ్డి బావిలాంటోడు. అక్కడకు వెళితే నీళ్ళు తాగొచ్చనే ఆశ వుంటుంది. అదే సముద్రం నిండా నీళ్ళున్నా తాగడానికి పనికిరావు. కొందరు నాయకులు సముద్రం లాగా కనిపిస్తున్నా ఎందుకూ పనికిరారు. కాబట్టే జనం అక్కడికి పోరు. అల్లీపురంలో ఇంటికిపోయినా, ఆదిత్యనగర్‌లో ఆఫీసుకు వెళ్లినా ఖచ్చితంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పలుకరిస్తాడని, సమస్య వింటాడని, వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడుతాడనే గ్యారంటీ వుంది. ఆ నమ్మకమే ప్రజలను ఆయన ఆఫీసువైపు నడిపిస్తుంటుంది. 2014 ఎన్నికల తర్వాత ఏ పదవీ లేనప్పుడే ప్రజల మధ్య బిజీగా వున్న లీడర్ అతడు. ఆ తర్వాత ఎమ్మెల్సీ, ఆపై మంత్రి అయ్యాడు. అతనిపై ప్రజల ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. ఆయన వద్దకు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలూ పెరిగారు. దీనికితోడు రాష్ట్రంలో ఎక్కడ ఎలక్షన్‌లు వచ్చినా, పార్టీ పరంగా ఏదన్నా సమస్య వచ్చినా, ప్రతిపక్ష వైకాపా మీద విమర్శల దాడి చేయాలన్నా తెలుగుదేశంకు వున్న బుల్లెట్‌లలో ఈయన ఒకడు. ఈమధ్య పార్టీ పనులకు కూడా బాగానే వాడుతున్నారు. దీంతో తాను ఇన్‌ఛార్జ్‌గా వున్న సర్వేపల్లి నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నాడు. అయినా కూడా జిల్లాలో కొంతమంది ఎమ్మెల్యేలు కంటే కూడా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుండడంలో ఆయన చాలా బెటర్. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు తాను అందుబాటులో లేకున్నా వారి పనులు ఆగకూడదని, 24×7 వారి సేవలో వుండాలని చెప్పి తన రాజకీయ వారసుడిగా కొడుకు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని రంగంలోకి దించాడు. 2014 ఎన్నికలప్పుడే సర్వేపల్లిలో తన తండ్రి కోసం రాజగోపాల్‌రెడ్డి పూర్తిస్థాయిలో కష్టపడ్డాడు. ఆ తర్వాత కూడా సర్వేపల్లి రాజకీయాలలో అనుక్షణం వుంటున్నాడు. పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. కార్యకర్తలకు అందుబాటులో వుంటున్నాడు. పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గంలో చురుకుగా కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ నాలుగైదు వందల గడపలు తొక్కుతూ, ప్రజలను అభిమానంగా పలుకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ తండ్రికి తగ్గ తనయుడిగా రాణిస్తున్నాడు ఈ సోమిరెడ్డి వారసుడు.

# 'ప్రజాబాట' విజయానికి ప్రార్ధనలు





ఈ నెల 30వ తేదీ నుంచి తాను తలపెట్టిన 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పలువురు పెద్దల దగ్గర ఆశీస్సులు తీసుకున్నారు. 26వ తేదీన ఏసి స్టేడియంకు వెళ్ళి సీనియర్స్ సిటిజన్స్‌ను, వాకర్స్‌ను మర్యాదపూర్వకంగా కలసి వారి దీవెనలు పొందారు. అలాగే నగరంలో పలువురు ప్రముఖులను కూడా కలిసి ఆశీస్సులందుకున్నారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తలపెట్టిన 'మన ఎమ్మెల్యే-మన ఇంటికి' 105 రోజుల పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ వైఎస్సార్సీపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర రావు ఆలయాల్లోనూ, ప్రార్ధనామందిరాల్లోనూ ప్రార్ధనలు చేశారు. నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి గుడిలో 105టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అదేవిధంగా సాల్వేషన్ ఆర్మీ చర్చిలో పాస్టర్‌లచే ప్రత్యేక ప్రార్ధనలు, బారాషహీద్ దర్గాలో ఇమామ్‌చే దువా కార్యక్రమాలను నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు చెక్కా సాయి సునీల్, మందా పెద్దబాబు, నరసింహయ్య ముదిరాజ్, గాదం సతీష్‌కుమార్, హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 26వ తేదీన నెల్లూరులోని బారాషాహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మున్సిపల్‌శాఖా మంత్రి పి.నారాయణ, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com